ఒక గుడి కడితే
వెయ్యి మంది బిక్షగాళ్ళు
తయారవుతారు అదే.. ఒక బడి కడితే
వెయ్యి మంది మేధావులు
తయారవుతారు
- డా. బాబాసాహెబ్ అంబేద్కర్

Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 246 | గురువారం 26 ఫిబ్రవరి 2026 | పేజీలు : 9 | వెల రూ.6.50

irculated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## కాంగ్రెస్ నేతల అరెస్టు సిగ్గుచేటు

**- కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ**



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ఇటీవల ఢిల్లీలో జరిగిన ఎఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ యువ నేతలు భారత్- అమెరికా ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ చొక్కాలు విప్పి నిరసన తెలిపారు. సమ్మిట్‌లో నిరసన చేసిన కాంగ్రెస్ నేతల్ని పోలీసులు అరెస్టు చేయడాన్ని కాంగ్రెస్ నేత, వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా బుధవారం తీవ్రంగా ఖండించారు. ఈ అరెస్టు సిగ్గుచేటని ఆమె ధ్వజమెత్తారు. 'సత్యం కోసం, శాంతియుత, అహింసాయుత ప్రతిఘటన మనం గర్వించదగిన వారసత్వం. ఇది మహాత్మాగాంధీ, లక్షలాది మంది భారతీయుల పూర్వీకుల నుండి వారసత్వంగా వచ్చింది. ప్రపంచ ఒత్తిడికి తలొగ్గి భారతదేశ ప్రయోజనాలతో రాజీపడిన ప్రధానికి, ఆయన ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వరం పెంచడం 1.4 బిలియన్ల భారతీయుల

- మిగతా 2లో..

## ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే లక్ష్యం!

**- ఇజ్రాయిల్‌కు అండగా ఉంటాం : మోడీ**
**- ప్రధాని ప్రసంగాన్ని బహిష్కరించిన ఇజ్రాయిల్ ప్రతిపక్షాలు**

టెల్ అవీవ్ - సూర్య వాస్తవం

భారత్, ఇజ్రాయిల్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యమని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. 2023 అక్టోబర్‌లో ఇజ్రాయిల్‌పై హమాస్ దాడి అనాగరికమంటూ తీవ్రంగా ఖండించారు. గాజాలో ఇజ్రాయిల్ జరుపుతున్న మారణహోమంలో చిన్నారులు మహిళలుసహా 72 వేలమందికిపైగా ప్రాణాలు కోల్పోయినా, దాని గురించి ప్రస్తావించకపోగా, ఇజ్రాయిల్‌కు అండగా ఉంటామని మోడీ చెప్పడం గమనార్హం. రెండు రోజుల అధికార పర్యటన నిమిత్తం బుధవారం టెల్‌అవీవ్ చేరుకున్న ప్రధాని మోడీకి బెన్ గురియన్ విమానాశ్రయంలో రెడ్ కార్పెట్ స్వాగతం లభించింది. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు, ఆయన సతీమణి సారా సాదరంగా స్వాగతం పలికారు. ఇజ్రాయిల్ పార్లమెంట్‌లో ప్రధాని మోడీ హమాస్ దాడి గురించి మాట్లాడుతూ 'మీ బాధను మేం అనుభవిస్తున్నాం. మీ



బాధను పంచుకుంటాం. ప్రస్తుతం, భవిష్యత్‌లో కూడా ఇజ్రాయిల్‌పై పూర్తి నమ్మకంతో ధృఢంగా భారత్ నిలుస్తుంది' అని చెప్పారు. 'ప్రజలను చంపడాన్ని ఏ కారణం కూడా సమర్థించదని, ఉగ్రవాదాన్ని ఏదీ సమర్థించదని మోడీ అన్నారు. 'భారత్ కూడా ఉగ్రవాదంతో బాధను భరించింది. 26/11 ముంబై దాడుల్లో ఇజ్రాయిల్ పౌరులతో సహా అనేక మంది అమాయక ప్రజల ప్రాణాలను కోల్పోయిన సంఘటనలను గుర్తుంచుకుంటాం. ఉగ్రవాదంపై సహనం లేని, రాజీలేని విధానాన్ని కలిగి ఉన్నాం. ఇందులో ఎటువంటి ద్వంద్వ ప్రమాణాలు లేవు' అని అన్నారు. ఈ ప్రాంతంలో చర్చలు, శాంతి, స్థిరత్వం కోసం ఇజ్రాయిల్‌తో భారత్ కలిసి ఉంటుందని మోడీ చెప్పారు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఆమోదించిన గాజా శాంతి చొరవ ఒక మార్గాన్ని అందిస్తుందని మోడీ చెప్పారు. భారత్‌లో

- మిగతా 2లో..



## సుప్రీంకోర్టులో మల్లారెడ్డికి దక్కని ఊరట

- మాజీ మంత్రి మల్లారెడ్డి పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు
- హైకోర్టు ఆదేశాల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టీకరణ
- సర్వే ప్రక్రియ పూర్తయినందున జోక్యానికి నిరాకరణ

2లో

## మార్చి 8న ప్రజాభవన్‌లో.. మహిళా జర్నలిస్టులతో 'ఉమెన్స్ డే'

**- సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యే అవకాశం**

2లో



## మా చిరకాల కోరిక నెరవేర్చిన ప్రభుత్వం

**-- సీఎం రేవంత్‌రెడ్డికి ఉద్యోగ,పెన్షనర్ సంఘాల కృతజ్ఞతలు**

హైదరాబాద్ - సూర్య వాస్తవం

దశాబ్దాల తమ చిరకాల కోరికను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని ఉద్యోగ, పెన్షనర్ సంఘాల నేతలు తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లకు రూ.1.20 కోట్ల ప్రమాద బీమా వర్తింపజేయడంతోపాటు రూ.1,056 కోట్ల మూలనిధితో ఉద్యోగుల, పెన్షనర్ల ఆరోగ్య పథకానికి

- మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి




## ఈ ఏడాదే భోగాపురం విమానాశ్రయ వాణిజ్య సేవలు

**- పోర్టులు, ఫిషింగ్ హార్బర్ నిర్మాణాలను సకాలంలో పూర్తి చేస్తాం**
**- శాసమండలిలో మంత్రి జనార్ధన్ రెడ్డి**

అమరావతి - సూర్య వాస్తవం

అల్లూరి సీతారామరాజు (భోగాపురం) అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధి పనులు 95 శాతం పూర్తయ్యాయని మౌలిక సదుపాయాలశాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి తెలిపారు. బుధవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో భోగాపురం ఎయిర్‌పోర్టుపై సభ్యులు పివివి సూర్యనారాయణ రాజు, వరుదు కళ్యాణి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. 2026 మధ్య నాటికి పూర్తి స్థాయి వాణిజ్య సేవలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ ఎయిర్ పోర్టు శంకుస్థాపనకు ముందే అవసరమైన అనుమతులు తీసుకున్నామన్నారు. తుమాటి మాధవరావు, వరుదు కళ్యాణి, మొండితోక అరుణకుమార్ అడిగిన మరో ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ.. రాష్ట్రంలోని పోర్టుల ప్రయివేటీకరణ అంశంపై ప్రభుత్వం వద్ద ఎటువంటి ప్రతిపాదన లేదన్నారు.

- మిగతా 2లో..

## ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

- అధికారులతో సమీక్షలో ఏపీ సీఎం చంద్రబాబు
- రాజమహేంద్రవరం, శ్రీకాకుళం ఘటనలపై ఆరా
- శ్రీకాకుళం డయేరియా బాధితుల్లో ఇద్దరికి సీరియస్
- మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు సీఎంకు తెలిపిన అధికారులు

అమరావతి- సూర్య వాస్తవం

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని, నిర్లక్ష్యం వహించొద్దని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. శ్రీకాకుళంలో డయేరియా నియంత్రణపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో శ్రీకాకుళం డయేరియా, రాజమండ్రి కల్తీ పాలు ఘటనలపై వైద్యారోగ్య, మున్సిపల్ అధికారులతో

- మిగతా 2లో..



## పారిశ్రామికాభివృద్ధికి 'క్లస్టర్' వ్యూహం..

అమరావతి- సూర్య వాస్తవం

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేసి, యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం 'క్లస్టర్ బేస్డ్' విధానంతో ముందుకు వెళ్తోందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. సూపర్-6 హామీల్లో భాగంగా ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు సృష్టించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమా ధానమిస్తూ, రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ కల్పనపై (

- మిగతా 2లో..



- ఉద్యోగాల కల్పనపై మంత్రి లోకేష్ కీలక ప్రకటన
- క్లస్టర్ల విధానంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వ ప్రణాళిక
- రాష్ట్రవ్యాప్తంగా 22 పారిశ్రామిక క్లస్టర్ల గుర్తించామన్న మంత్రి లోకేశ్
- ప్రపంచస్థాయి నైపుణ్య శిక్షణ, ఉద్యోగావకాశాలకు 'నైపుణ్యం' పోర్టల్
- పరిశ్రమల భాగస్వామ్యంతో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల బలోపేతం

## ద్వైపాక్షిక సంబంధాల

# బలోపేతమే లక్ష్యం!

(మొదటిపేజీ తరువాయి)

యూదు ప్రజలు ఎలాంటి హింస, వివక్ష లేకుండా జీవిస్తున్నారని అన్నారు. ప్రస్తుత అనిశ్చిత ప్రపంచంలో భారత్, ఇజ్రాయిల్ వంటి విశ్వసనీయ భాగస్వాముల మధ్య బలమైన రక్షణ భాగస్వామ్యం చాలా ముఖ్యమని మోడీ తెలిపారు. త్వరలోనే భారత్ ప్రపంచ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందని, ఇజ్రాయిల్ ఆవిష్కరణ, సాంకేతిక రంగాల్లో శక్తివంతమైన దేశమని మోడీ తెలిపారు. ఈ సందర్భంగా మోడీకి ఇజ్రాయిల్ పార్లమెంట్ 'స్పీకర్ ఆఫ్ ది నెస్సెట్ పతకం'ను ప్రదానం చేసింది. నెస్సెట్ అత్యున్నత గౌరవంగా భావించే ఈ పతకాన్ని భారత్–ఇజ్రాయిల్ మధ్య వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేయడానికి చేసిన అసాధారణ కృషికి గుర్తింపుగా ప్రదానం చేస్తున్నట్టు పార్లమెంట్ తెలిపింది. అంతకుముందు పార్లమెంట్‌లోని అతిథుల పుస్తకంలో మోడీ సంతకం చేశారు. మోడీని పొగడ్తలో ముంచెత్తిన నెతన్యాహు, 'ప్రధాని మోడీ మనకు అండగా నిలిచారు.' ఇజ్రాయిల్‌కు మంచి మిత్రుడు అని వ్యాఖ్యా నించారు. దాదాపు 150కోట్ల మంది ప్రజలు కలిగిన భారత్ మహత్తరమైన శక్తి కలిగిన దేశం. దానితో పోలిస్తే ఇజ్రాయిల్ చాలా చిన్నది, అయినా శక్తివంతమైనదే, మన రెండు దేశాల మధ్య పొత్తు మన వ్యక్తిగత శక్తుల కన్నా అనేక రెట్లు ఎక్కువ. మీరు మాతో నిలిచారు." అని నెతన్యాహు పార్లమెంట్‌నుద్దేశించి మాట్లాడుతూ వ్యాఖ్యానించారు.

**మోడీ ప్రసంగాన్ని బహిష్కరించిన ప్రతిపక్షాలు**

భారత ప్రధాని మోడీ పర్యటనకు ముందు ఇజ్రాయిల్ పార్లమెంట్‌లో గందరగోళం చెలరేగింది. ఇజ్రాయిల్‌లోని ప్రతిపక్ష పార్టీలు నెస్సెట్ (ఇజ్రాయిల్ పార్లమెంట్)లో మోడీ ప్రసంగాన్ని బహిష్కరించాయి. నెస్సెట్ స్పీకర్ అమీర్ ఒహానా నిర్ణయంతో వివాదం ప్రారంభమైంది. నెతన్యాహు ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలను విస్మరిస్తోందని, దీనితో భారత ప్రధాని ప్రసంగానికి హాజరు కాకూడదని నిర్ణయించాయి. ప్రతిపక్షాల బహిష్కరణతో భారత ప్రధాని పర్యటన చుట్టూ అసౌకర్య వాతావరణాన్ని ఏర్పర్చింది. మోడీ ప్రసంగించే సమయంలో పార్లమెంటులో సగం సీట్లు ఖాళీగా ఉండటం ప్రతికూల సందేశాన్ని పంపినట్టయ్యింది. ఈ పరిస్థితిని నివారించడానికి అధికార పార్టీ ఉన్న సభ్యులను నిలబెట్టి మోడీ.. మోడీ అంటూ నినాదాలు చేయించటం గమనార్హం.

**స్వదేశంలో విమర్శల వెల్లువ**

మోడీ పర్యటనపై భారత్‌లో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిపిఎం, కాంగ్రెస్ సహా పలు పార్టీలు ఈ పర్యటనను ఖండించాయి. పాలస్తీనియన్ల ప్రజల ప్రయోజనాలకు ద్రోహం చేయడమేనని విమర్శించాయి. అమెరికా లైంగిక నేరస్తుడు ఎప్‌స్టీన్ ప్రోద్బలంతోనే వారి ఆకాంక్షలకు తగినట్లుగా మోడీ నడుచుకున్నారని కాంగ్రెస్ నేత రాహల్ గాంధీ విమర్శించారు. సుదీర్ఘకాలంగా భారత్ అమలు చేస్తూ వచ్చిన రెండు దేశాల సిద్ధాంతాన్ని మోడీ ప్రభుత్వం కాలరాసిందని అన్నారు. ఈ పర్యటనను తీవ్రంగా వ్యతిరేకించాలని సిపిఎం పిలుపునిచ్చింది. గాజాలో పాలస్తీనియన్ల ఊచకోత అంశాన్ని ప్రధాని మోడీ లేవనెత్తాలని కాంగ్రెస్ ఎంపి తారిక్ అన్వర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేత శశిథరూర్ నేతృత్వంలో సమావేశమైన స్థాయీ సంఘం కూడా ప్రధాని మోడీ పర్యటనా సమయాన్ని తీవ్రంగా ప్రశ్నించింది.

## మా చిరకాల కోరిక

# నెరవేర్చిన ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల నేతలు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం ప్రకటించిన ఆరోగ్య, బీమా పథకాలు చరిత్రలో నిలిచిపోతాయని వారు కొనియాడారు. 1,998 వ్యాధులకు నగదు రహిత చికిత్సలను పొందే విధంగా ఉద్యోగులు, పెన్షనర్లకు అవకాశం లభించడం నిజంగా వరమని ఉద్యోగ సంఘాల నేతలు అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని క్యాబినెట్ ఆలోచించి ఉద్యోగులు, పెన్షనర్ల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ తీసుకున్న ఈ నిర్ణయాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిపోతాయని అన్నారు. ముఖ్యమంత్రితోపాటు, మంత్రివర్గ సభ్యులకు ఉద్యోగ సంఘాల నేతలు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, నాయకులు పి దామోదర్‌రెడ్డి, చావ రవి, జి సదానందగౌడ్, కె వెంకటేశ్వర్లు, ఉపేందర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, లక్ష్మయ్య, పి కృష్ణమూర్తి, ఉమాదేవి, వి రవీందర్‌రెడ్డి, గిరి శ్రీనివాస్‌రెడ్డి, ఖాదర్, టి లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు హైదరాబాద్‌లోని టీఎన్జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఉద్యోగ జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడారు. ఉద్యోగులకు నగదు రహిత ఆరోగ్య కార్డులు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వావానికి ధన్యవాదాలు చెప్పారు. ఉద్యోగులకు రూ.1.20 కోట్ల ప్రమాద బీమా వర్తింపజేయడం పట్ల హర్షం ప్రకటించారు. పెండింగ్ బిల్లులను నెలకు రూ.700 కోట్ల నుంచి రూ.1,500 కోట్లకు పెంచాలని డిమాండ్ చేశారు.

## పారిశ్రామికాభివృద్ధికి

# 'క్లస్టర్' వ్యూహాం..

(మొదటిపేజీ తరువాయి)

పభుత్వ ప్రణాళికను ఆయన వివరించారు. ఈ కొత్త విధానంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 22 పారిశ్రామిక క్లస్టర్లను గుర్తించినట్లు లోకేశ్ తెలిపారు. రాయలసీమలో ఆటోమోటివ్, కర్నూలులో పునరుత్పాదక ఇంధనం, కడప–చిత్తూరుల్లో ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్, నెల్లూరులో గ్లాస్, ఉత్తరాంధ్రలో ఫార్మా, మెడికల్ డివైసెస్ వంటి క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఒకే చోట ప్రధాన పరిశ్రమలతో పాటు వాటికి అవసరమైన అనుబంధ పరిశ్రమలు,

విడిభాగాల తయారీ యూనిట్లను నెలకొల్పడం ద్వారా బలమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను (ఎకోసిస్టమ్) నిర్మించడమే తమ లక్ష్యమని వివరించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను అందించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో తయారయ్యే ప్రతి 100 ఏసీలలో 50 మన రాష్ట్రంలోనే ఉత్పత్తి అవుతున్నాయని, డైకిన్, ఎల్జీ వంటి కంపెనీలు తమకు అవసరమైన కోర్సులను ఐటీఐలలో ప్రవేశపెట్టాలని కోరాయని చెప్పారు. పరిశ్రమల భాగస్వామ్యంతో కోర్సుల కరిక్యులమ్ మార్చి, యువతకు నాణ్యమైన శిక్షణ అందిస్తామని హామీ ఇచ్చారు.




# ఆహారం భద్రమేనా.?

- ఆహార కల్తి నియంత్రించే ప్రయోగశాలలు లేకపోవడంతో ప్రజా ఆరోగ్యానికి ముప్పు
- నిలిచిపోయిన ఫుడ్ అనలిస్టుల నియామకాలు
- ల్యాబ్‌లు ఉన్నా సమగ్ర పరీక్షలు లేవు
- కల్తి నియంత్రణ చర్యలేవి ...?

ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందుబాటులో ఉంచే లక్ష్యంతో భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఆహార పదార్థాలకు సంబంధించి శాస్త్రీయ ఆధారిత ప్రమాణాలను రూపొందించడంతో పాటు అవి తయారయ్యే విధానం, నిల్వ, పంపిణీ, విక్రయం, దిగుమతులను నియంత్రించడం వంటి బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తోంది.ఆహార భద్రతా ప్రమాణాల చట్టం, 2006 అమలు, పర్యవేక్షణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి బాధ్యతగా ఉంది. కేంద్ర స్థాయిలో శాస్త్రీయ ఆధారిత ప్రమాణాలను రూపొందించడం, మొత్తం సమన్వయం ఎఫ్ఎస్ఎస్ఏఐ బాధ్యత కాగా, రాష్ట్రాల స్థాయిలో ప్రధానంగా క్షేత్ర స్థాయిలో ఈ చట్టం అమలును పర్యవేక్షించడం, అమలు చేసే బాధ్యతను రాష్ట్ర ఆహార భద్రతా సంస్థలు కలిగి ఉన్నాయి.

**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :**

ప్రజల ఆహారం సురక్షితంగా ఉండేలా చూడడం ఏ ప్రభుత్వానికైనా అత్యంత ప్రాథమిక బాధ్యత. ప్రజలు తాగే పాలు, వినియోగించే నెయ్యి సురక్షితమని నమ్మలేని పరిస్థితి వస్తే, పాలనపై ప్రశ్నలు తలెత్తుతాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన ఘటనలు చూస్తే, ప్రభుత్వం నిర్మాణాలు ఏర్పాటు చేసినా ప్రజారోగ్యాన్ని కాపాడే కార్యాచరణ సామర్థ్యాన్ని మాత్రం నిర్మించలేదని స్పష్టమవుతోంది.ఏళ్ల తరబడి ఆలస్యం తర్వాత తిరుమలలో సుమారు ?25 కోట్లతో అధునాతన ఎలక్ట్రానిక్ టంగ్, ఎలక్ట్రానిక్ నోస్ సాంకేతికతతో ఆహార పరీక్షా ప్రయోగశాల ఏర్పాటు చేశారు. కాగితాలపై ఇది సాంకేతిక పురోగతి కనిపించిన, వాస్తవానికి ఇది తక్కువ సిబ్బందితోనే నడుస్తోంది. దాదాపు ఆరు కోట్ల జనాభా ఉన్న రాష్ట్రానికి గణనీయంగా తక్కువ మంది ఫుడ్ అనలిస్టుల మాత్రమే ప్రభుత్వ సేవలో ఉన్నారు. తిరుమల ప్రయోగశాలలోనే ముగ్గురు అనలిస్టులు మాత్రమే పనిచేస్తున్నారని సమాచారం. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, కాకినాడలోని ఆహార పరీక్షా ప్రయోగశాలపై ఎక్కువగా ఆధారపడుతోంది. ఈ ల్యాబ్ ఒకవైపు విద్యా కార్యక్రమాలు నిర్వహిస్తూ నియంత్రణ బాధ్యతలు కూడా నిర్వర్తించాల్సి వస్తుంది. ప్రత్యేక నియంత్రణ వ్యవస్థను బలోపేతం చేయాల్సింది పోయి, ప్రభుత్వం తన బాధ్యతలో భాగాన్ని ఒక విద్యాసంస్థకు బదిలీ చేసినట్టైంది. ఫలితంగా ఖరీదైన పరికరాలు సరిగా వినియోగంలోకి రాకపోగా నమూనాలను పరీక్షల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. రాజమహేంద్రవరంలో ఒకే సరఫరాదారుని నుంచి కల్తీ పాలు తీసుకున్న వందకు పైగా కుటుంబాల ఘటనతో ఈ పరిస్థితి తీవ్రంగా బయటపడింది. ఐదుగురు మృతి చెందగా, పిల్లలు సహా మరికొందరు ఇంకా విషమ స్థితిలో ఉన్నారు. ఘటన జరిగిన తర్వాత కూడా విషతత్వ నివేదికలు ఇతర ప్రాంతాల ల్యాబ్‌ల నుంచి రావాల్సి వచ్చింది. స్థానికంగా కలుషిత పదార్థాలు వెంటనే గుర్తించే సామర్థ్యం లేకపోవడం వల్ల నివారణ వ్యవస్థ మరణాల తర్వాత మాత్రమే స్పందించింది.అధికారులు తరచుగా "ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్" మొబైల్ యూనిట్లను పర్యవేక్షణకు ఉదాహరణగా చూపుతున్నారు. ఇది ప్రాథమిక కల్తీ లను మాత్రమే గుర్తించగలవు. కానీ పురుగుమందు అవశేషాలు, యాంటీబయాటిక్ విశేషాలు, హెవీ మెటల్స్, అఫ్లాటాక్సిన్, హార్మోన్ కలుషితాలు వంటి సంక్లిష్ట పదార్థాలు గుర్తించలేవు. ఇవి కేవలం ప్రాథమిక స్క్రీనింగ్ సాధనాలు మాత్రమే. ధృవీకరణాత్మక ప్రయోగశాలలు లేకుండా చట్టపరమైన చర్యలు కష్టమవుతాయి, దీంతో కల్తీదారులు భయపడకుండా వ్యవహరించే పరిస్థితి ఏర్పడుతుంది.అసలు సమస్య మానవ వనరుల్లో ఉంది. అర్హత కలిగిన ఫుడ్ అనలిస్టుల నియామకాలు సంవత్సరాలుగా నిలిచిపోయాయి. అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయి లేదా ఆమోదించబడలేదు. ఉన్న సిబ్బంది ఆధునిక పరికరాలపై తగిన శిక్షణ లేకపోవడంతో పరీక్షలు పరిమిత ప్రమాణాలకే కుదురుతున్నాయి. ఫలితంగా పశువైద్య ఔషధ అవశేషాలు, యాంటీబయాటిక్ కలుషితం, పురుగుమందు అవశేషాలు వంటి ప్రమాదకర పదార్థాలు గుర్తించకుండా మిగిలే అవకాశముంది. ల్యాబ్‌లు ఉన్నా సమగ్ర పరీక్షలు లేవు.పరీక్షల సామర్థ్యం తక్కువగా ఉండటంతో నమూనాలను తరచూ రాష్ట్రం వెలుపల లేదా ప్రైవేట్ ల్యాబ్‌లకు పంపాల్సి వస్తోంది. జేఎన్‌టీయూ కాకినాడ ల్యాబ్‌పై అధిక భారం పడుతోంది. నివేదికలు రావడానికి వారాలు, నెలలు పడుతున్నాయి. అప్పటికి కల్తీ ఉత్పత్తులు వినియోగంలోకి వెళ్లిపోయి ఉండవచ్చు. ల్యాబ్‌లను బలోపేతం చేయడానికి పంపిన ప్రతిపాదనలు సంవత్సరాలుగా అమలుకాకుండా పెండింగ్‌లోనే ఉన్నాయి.ప్రజారోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం నియంత్రణ వ్యవస్థ భవనాల సంఖ్యపై కాకుండా పరీక్షల వేగం, విశ్వసనీయతపై ఆధారపడి ఉంటుంది. ధృవీకరణకు నెలలు పట్టితే పర్యవేక్షణ ప్రభావం కోల్పోతుంది.

నివారణ బదులు నష్ట నియంత్రణకు వ్యవస్థ పరిమితమవుతుంది.ఇటీవలి ఘటనలు ప్రకటనలు మరియు సిద్ధత మధ్య ఉన్న నిర్మాణాత్మక అంతరాన్ని వెలుగులోకి తెచ్చాయి. ఆధునిక పరికరాలు ఉన్నా శిక్షణ పొందిన సిబ్బంది, సమయానుకూల పరీక్షా సామర్థ్యం లేనప్పుడు వినియోగదారులకు నిత్యావసర ఆహారంపై అనిశ్చితి నెలకొంటుంది. నియంత్రణ సంస్థల చర్యలు పరిమితమవుతాయి. బాధితులకు మాత్రం ఆలస్యంగానే సహాయం అందుతుంది.ప్రస్తుతం రాష్ట్ర ఆహార భద్రతా వ్యవస్థలో మౌలిక వసతులు ఉన్నా కార్యాచరణ సిద్ధత లేకపోవడం వల్ల ప్రజారోగ్యం భరోసా కంటే యాదృచ్ఛికతపై ఆధారపడుతున్నదనే ఆందోళన కలుగుతోందని డా. ముచ్చుకోట సురేష్ బాబు తెలిపారు

# ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

(మొదటిపేజీ తరువాయి)

సమీక్షించారు. వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు, ఆయా జిల్లాల అధికారులతో సిఎం మాట్లాడారు. వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిపై ఆయన వాకబు చేశారు. శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రిలో ఆరోగ్యం విషమంగా ఉండి చికిత్స పొందుతున్న ఇద్దరి బాధితుల ఆరోగ్యం గురించి ఆరా తీశారు. ఒకరు వెంటిలేటర్ మీద చికిత్స పొందుతున్నారని, మరొకరికి డయాలసిస్ అందిస్తున్నామని అధికారులు వివరించారు. పాల శాంపిళ్లను ఇప్పటికే ల్యాబ్‌కు పంపామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

# కాంగ్రెస్ నేతల అరెస్టు సిగ్గుచేటు

(మొదటిపేజీ తరువాయి)

ప్రయోజనాలకు మంచిది. ప్రజల గొంతును పెంచినందుకు యూత్ కాంగ్రెస్ సభ్యులపై తీసుకున్న చర్య తీవ్రంగా ఖండించదగినది. సిగ్గుచేటైన విషయం. కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ యొక్క నిర్భయ సైనికులకు దృఢంగా అండగా నిలుస్తుంది ' అని ఆమె బుధవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు పేర్కొన్నారు. చేశారు. అని ప్రియాంక ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. కాగా, ఎఐ సదస్సులో షర్ట్ విప్పి నిరసన తెలిపిన ఘటనకు కీలక సూత్రధారిగా భావించిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఉదరు భాను చిబ్‌ను మంగళవారం అరెస్టు చేశారు. ఉదరు భానుతోపాటు మరో ఆరుగురు కాంగ్రెస్ కార్య కర్తల్ని అరెస్టు చేసి.. వారిపై అల్లర్లకు పాల్పడినట్లు పోలీసులు అభియోగాలు మోపారు.

## ఈ ఏడాదే భోగాపురం

# విమానాశ్రయ వాణిజ్య సేవలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మచిలీపట్నం, మూలపేట, రామాయపట్నం, కాకినాడ సెజ్–4 పోర్టులు, ఉప్పాడ, మచిలీపట్నం, నిజాంపట్నం, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్లు సకాలంలో పూర్తి చేస్తామని తెలిపారు. ఆయా ప్రాజెక్టులకు గత, ప్రస్తుత ప్రభుత్వాల కాలంలో చేసిన ఖర్చు, పురోగతి వివరాలను వెల్లడించారు. కోనసీమ జిల్లాల్లో గ్యాస్ లీకేజీ ఘటనలను పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని సభ్యులు నాగబాబు అడిగిన ప్రశ్నకు మంత్రి జనార్ధన్ సమాధానం ఇచ్చారు.

## సుప్రీంకోర్టులో

# మల్లారెడ్డికి దక్కని ఊరట

(మొదటిపేజీ తరువాయి)

భూమికి హద్దులు నిర్ణయించాలని కోరుతూ శేరి శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తి తొలుత హైకోర్టును ఆశ్రయించారు. తన భూమికి వెళ్లే దారిని మూసివేశారని, ఈ విషయంలో తహసీల్దార్ జారీ చేసిన లేఖను కూడా ఆయన తన పిటిషన్‌లో సవాల్ చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జి, 45 రోజుల్లోగా సర్వే పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ తీర్పును మల్లారెడ్డి తదితరులు డివిజన్ బెంచ్‌లో సవాల్ చేయగా, సింగిల్ జడ్జి ఉత్తర్వులను ద్విసభ్య ధర్మాసనం సమర్థించింది. దీంతో వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై నిన్న జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్.వి. అంజరియాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. సర్వే ప్రక్రియ ఇప్పటికే పూర్తయినందున, ఈ దశలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేస్తూ పిటిషన్‌ను తోసిపుచ్చింది.

## మార్చి 8న ప్రజాభవన్‌లో..

## మహిళా జర్నలిస్టులతో 'ఉమెన్స్ డే'

## - సీఎం హాజరయ్యే అవకాశం

**హైదరాబాద్ – సూర్య వాస్తవం**


మహిళా జర్నలిస్టులతో మార్చి ఎనిమిదో తేదీన ఉమెన్స్ డే నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు సన్నాహాలు చేస్తున్నది. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఈ కార్యక్రమం చేపట్టను న్నారు. నగరంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రముఖ మహిళా జర్నలిస్టులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా సభను నిర్వహించే అవకాశాలు ఉన్నాయని సమాచారం. దీనికి సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.రామకృష్ణారావు, మీడియా అకాడమీ చైర్మెన్ కె శ్రీనివాస్‌రెడ్డితోపాటు సమాచార, పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్ ప్రియాంక హాజరు కానున్నారు.

# సంపాదకీయం



## ఆసక్తకరంగా తమిళ రాజకీయాలు

తమిళనాడు రాజకీయాల్లో సంచలనం చోటుచేసుకుంది.తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల వేడి రాజుకుంటోంది. 'తమిళగ వెట్రి కళగం పార్టీ అధ్యక్షుడిగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టిన సినీ నటుడు దళపతి విజయ్ . అధికార డీఎంకే సీఎం ఎంకె స్టాలిన్ లక్ష్యంగా విమర్శల దాడిని తీవ్రం చేశారు. వేలూర్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో పాల్గొన్న ఆయన.. అధికార పక్షంపై సంచలన ఆరోపణలు చేశారు. రాబోయేది కేవలం ఎన్నికలు కాదని, అవినీతి ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రజలకు మధ్య జరగబోయే మహా యుద్ధమని, ఇందులో అంతిమ విజయం ప్రజలదేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి, అందరూ చిన్నమ్మ అని పిలుచుకునే శశికళ తన కొత్త రాజకీయ ప్రస్థానాన్ని అధికారికంగా ప్రారంభించారు. జయలలిత జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆమె తన కొత్త రాజకీయ పార్టీ జెండాను ఆవిష్కరించారు. శశికళ ఆవిష్కరించిన పార్టీ జెండాను నలుపు, తెలుపు, ఎరుపు రంగులతో ఉంది. అత్యంత ప్రాముఖ్యత కలిగిన అంశం ఏంటంటే.. ఈ జెండా మధ్యలో ద్రవిడ రాజకీయ దిగ్గజాలు అన్నాదురై, ఎంజీఆర్, జయలలిత ముఖచిత్రాలను పొందుపరిచారు. తద్వారా తానే జయలలిత అసలైన రాజకీయ వారసురాలినని ఆమె పరోక్షంగా కేడర్‌కు సంకేతాలు పంపారు.సభలో ప్రసంగిస్తూ శశికళ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. జయలలిత మరణం తర్వాత తనపై జరిగిన దుష్ప్రచారాన్ని గుర్తు చేసుకుని ఆమె కన్నీరు పెట్టుకున్నారు. జయలలిత నేనే హత్య చేశానని ప్రచారం చేసి నా మనసును గాయపరిచారు. జయలలిత మరణించిన సమయంలో నేను తీవ్రమైన దుఃఖంలో ఉన్నాను. అందుకే అప్పుడు చాలా మంది బతిమలాడినా నేను పార్టీ అధ్యక్ష పదవిని గానీ, సీఎం పదవిని గానీ తీసుకోలేదు అని శశికళ ఆవేదన వ్యక్తం చేశారుప్రస్తుత అన్నాడీఎంకే అగ్రనాయకత్వంపై ఆమె నిప్పులు చెరిగారు. పన్నీర్ సెల్వం అప్పట్లో ఆయన తనను తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తు చేశారు. పళనిస్వామిని సీఎంను చేయడం తాను చేసిన అతి పెద్ద పొరపాటు అని ఆమె తెలిపారు. ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన తర్వాత తనను ఒక చిత్తుకాగితంలా చూశారని, చివరకు హీనంగా పార్టీ నుంచి బహిష్కరించారని ఆవేదన వ్యక్తం చేశారు.జయలలిత చనిపోయిన తర్వాత తమిళనాట అనేక చిత్ర విచిత్రాలు జరిగాయని, ఇకపై తాను మౌనంగా ఉండబోనని శశికళ స్పష్టం చేశారు. "తమిళ రాజకీయాల్లో ఇక నా మార్క్ చూపిస్తాను.. ప్రజల కోసం యాక్టివ్‌గా పని చేస్తాను" అని ఆమె ప్రకటించారు. పార్టీ పేరు, విధివిధానాలపై త్వరలోనే స్పష్టమైన ప్రకటన చేస్తానని ఆమె తెలిపారు.ప్రభుత్వ అవినీతిని, అక్రమాలను తాను నిర్భయంగా ప్రశ్నిస్తున్నందుకే అధికార పార్టీ తనను ప్రధాన లక్ష్యంగా చేసుకుందని విజయ్ ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను కలవకుండా అడ్డుకునేందు కు టీవీకే పార్టీ సభలకు సైతం ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అనుమతులు నిరాకరిస్తోందని మండిపడ్డారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా, కుట్రలు పన్నినా తాను వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. "ఇప్పుడు నన్ను ప్రజల్లోకి వెళ్లనివ్వకుండా అడ్డుకోవచ్చు.. కానీ ఎన్నికల్లో గెలిచి మా పార్టీ అధికారంలోకి వచ్చాక నేనే స్వయంగా ప్రతి గ్రామాన్ని సందర్శిస్తాను" అని విజయ్ సభాముఖంగా హామీ ఇచ్చారు.రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, నేరాలను అరికట్టడంలో స్టాలిన్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విజయ్ ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో తనను ఎలాగైనా ఓడించాలనే లక్ష్యంతోనే సీఎం స్టాలిన్ కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. పరిస్థితులకు అనుగుణంగా అవకాశవాద రాజకీయాలు చేయడం డీఎంకేకు వెన్నతో పెట్టిన విద్య అని, రాబోయే ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయంతో వారు బీజేపీతో పొత్తు పెట్టుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేకు ఓటు వేయడమంటే.. పరోక్షంగా బీజేపీకి ఓటు వేసినట్లేనని ఆయన కుండబద్దలు కొట్టారు.తాము అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత సురక్షితమైన ప్రాంతంగా మారుస్తానని విజయ ప్రతిజ్ఞ చేశారు. ముఖ్యంగా విద్య, భద్రతపై కీలక హామీలు ఇచ్చారు. నిరుపేద, మధ్యతరగతి విద్యార్థులు పోటీ పరీక్షల శిక్షణ కోసం లక్షల రూపాయలు ప్రైవేట్ సంస్థలకు పోయాల్సిన అవసరం లేకుండా .. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే ఉచితంగా నాణ్యమైన శిక్షణను అందిస్తామన్నారు. మారుమూల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సైతం బాలికల కోసం పరిశుభ్రమైన, సురక్షితమైన మరుగుదొడ్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. నేర రహిత సమాజం కోసం, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.




# మలుపులు తిరుగుతున్న కస్టోడియల్ టార్చర్

**గుంటూరు - సూర్య వాస్తవం**



డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు కస్టోడియల్ టార్చర్ కీలక మలుపులు తిరుగుతోంది. ఈ కేసులో ఏ6గా అలిగేషన్స్ ఫేస్ చేస్తున్న బిహార్ క్యాడర్ ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌ను ఏపీ పోలీసులు పట్నాకు వెళ్లి అరెస్ట్ చేశారు. అయితే ఆయనను ట్రాన్సిట్ వారెంట్‌పై ఏపీకి తీసుకురావడానికి అడ్డంకులు ఏర్పడ్డాయి. బిహార్ పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా అరెస్టు వారెంట్, కేసు వివరాలు చెప్పకుండా సునీల్ నాయక్‌ను ఎలా అరెస్టు చేస్తారని బిహార్ హైకోర్టు ప్రశ్నించి..టాన్సిట్ వారెంట్ జారీకి నిరాకరించినట్లు చెబుతున్నారు.ఇక నిందితుడు సునీల్ నాయక్ అరెస్టు సమయంలో పట్నాలో హైడ్రామా చోటుచేసుకుందని కూడా తెలుస్తోంది. బిహార్‌లో ఐజీగా పనిచేస్తున్న సునీల్ నాయక్ గత ప్రభుత్వంలో డిప్యుటేషన్‌పై ఏపీలో పనిచేశారు. ఏపీ సీఐడీ డీఐజీగా ఆయన పనిచేసిన సమయంలో నాటి ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అరెస్టు జరిగింది.

అప్పుడు రఘురామపై కస్టోడియల్ టార్చర్ జరిగినట్లు 2024లో కేసు నమోదైంది. ఆ కేసు బేస్‌గా అధికారులపై చర్యలు తీసుకుంటూ ముందుకెళ్తున్నారు పోలీస్ అధికారులు.సీఐడీ మాజీ చీఫ్, ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్‌పై ఇప్పటికే సస్పెన్షన్ వేటు పడింది. ముందస్తు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లడంతో పాటు మాజీ ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును వేధించిన కేసులో ఆయనపై అభియోగాలు ఉన్నాయి. 2020 నుంచి 2024 మధ్య పీవీ సునీల్ కుమార్ ప్రభుత్వ అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లారనే ఆరోపణలు ఉన్నాయి. సీఐడీ చీఫ్‌గా ఉన్నప్పుడు సునీల్‌కుమార్ సామాన్య ప్రజల్ని తప్పుడు కేసుల్లో ఇరికించి, కస్టడీలో చిత్రహింసలకు పెట్టారని..పలువురు బాధితుల ఫిర్యాదుల ఆధారంగా..ఓ హైకోర్టు న్యాయవాది కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు చేశారు.ఈ క్రమంలోనే సునీల్‌ను సస్పెండ్ చేసిన ఏపీ సర్కార్..రఘురామతో పాటు పలువురిని కస్టోడియల్ టార్చర్ పెట్టారన్న అలిగేషన్స్‌పై విచారణకు చేయిస్తుంది. సేమ్‌టైమ్ సునీల్ కుమార్‌పై అగ్రిగోల్డ్ నిధుల దుర్వినియోగం ఆరోపణలపై ఏసీబీ విచారణ కొనసాగుతోంది. రఘురామకృష్ణరాజును వేధించిన కేసు, అగ్రిగోల్డ్ కేసు ఫేస్ చేస్తుండటంతో ఆయన సస్పెన్షన్‌ను కంటిన్యూ కొనసాగిస్తూ వస్తోంది ప్రభుత్వం.

**విజయ్‌పాల్ ఇప్పటికే అరెస్ట్**

రఘురామ కృష్ణరాజును కస్టోడియల్ టార్చర్ కేసులో.. ఆయనను విచారించినప్పుడు ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా ఉన్న విజయ్‌పాల్ ఇప్పటికే అరెస్ట్ అయ్యారు. పలుసార్లు విచారణకు హాజరైన విజయ్‌పాల్..విచారణకు ఏ మాత్రం సహకరించకపోవడంతో అరెస్ట్ చేసి జైలుకు తరలించినట్లు చెప్పారు పోలీస్ అధికారులు. అప్పటి ప్రభుత్వ పెద్దల డైరెక్షన్‌లో సునీల్ కుమార్, సునీల్ నాయక్, విజయ్‌పాల్ రెచ్చిపోయారని.. రఘురామకృష్ణ రాజును చిత్రహింసలు పెడుతూ లైవ్ వీడియో చూయించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో లేటెస్ట్‌గా సునీల్ నాయక్ అరెస్ట్ కావడం సంచలనం రేపుతోంది. కోర్టు టాన్సిట్ వారెంట్ ఇస్తే కస్టడీలో సునీల్ నాయక్ చెప్పే వివరాల ఆధారంగా..సస్పెన్షన్‌లో ఉన్న మాజీ సీఐడీ చీఫ్ సునీల్ కుమార్‌ను కూడా అరెస్ట్ చేయడం ఖాయమన్న టాక్ వినిపిస్తోంది. తర్వాత విజయ్ పాల్, సునీల్‌ను విచారించి ..రఘురామ కృష్ణరాజును టార్చర్ చేయాలని చెప్పిందెవరు.? ఎవరి ఆదేశాలతో ఆయనను చిత్రహింసలు పెట్టారనే దానిపై వివరాలు సేకరించే అవకాశం ఉందంటున్నారు. అంతేకాదు టార్చర్ పెడుతున్నట్లు లైవ్ వీడియో ఎవరికి చూయించారనే దానిపై కూడా ఆరా తీసే చాన్స్ ఉందని చెబుతున్నారు. ఒకవేళ సునీల్ అరెస్ట్ అయితే మాత్రం ఈ వ్యవహారం అప్పటి ప్రభుత్వ పెద్దల వరకు వెళ్తుందన్న ప్రచారం జరుగుతోంది. ఇలా అప్పుడు విజయ్‌పాల్.. ఇప్పుడు సునీల్ నాయక్..నెక్స్ట్ సీఐడీ మాజీ చీఫ్ సునీల్ కుమార్ ఆ తర్వాత ఎవరు తమ వంతు వస్తుందోనన్న టెన్షన్ కొనసాగుతోంది. అప్పుడు కీలకంగా పనిచేసిన అధికారులు కూడా ఎప్పుడు తమ మెడకు ఉచ్చు బిగుసుకోబోతోందోనని టెన్షన్ పడుతున్నారట. రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు ఇంకెన్ని మలుపులు తీసుకుంటుందో చూడాలి మరి.

# క్లైమాక్స్‌కు చేరిన ఎమ్మెల్సీల కథ


**విజయవాడ - సూర్య వాస్తవం**



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన ఎమ్మెల్సీల వ్యవహారం ఒక కొలిక్కి వచ్చే అవకాశం కనిపిస్తున్నట్లుంది. వైసీపీకి రాజీనామా చేసిన అయిదురుగు ఎమ్మెల్సీలకు శాసన మండలి ఛైర్మన్ మోషెన్ రాజు ఇటీవల నోటీసులు జారీ చేశారు. ఈ అయిదురుగు తమ సమక్షంలో జరిగే విచారణకు హాజరు కావాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. ఈ నెల 25న విచారణకు హాజరు కావాలని జయ మంగళం వెంకటరమణకు నోటీసులు ఇస్తే 26న హాజరు కావాలని కళ్యాణ్ చక్రవర్తి, కర్రి పద్మశ్రీ, పోతుల సునీత, మర్రి రాజశేఖర్ లకు నోటీసులు ఇచ్చారు. దీంతో రేపటి నుంచి రాజీనామా చేసిన వైసీపీ ఎమ్మెల్సీలను మోషేన్ రాజు విచారించనున్నారు. తమ రాజీనామాలకు గల కారణాలను మండలి ఛైర్మన్‌కు వివరించనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అయిదుగురు ఎమ్మెల్సీలు 2024 లో వరుసగా రాజీనామాలు చేశారు. అంతే కాదు పార్టీకి సైతం గుడ్ బై కొట్టారు. వీరిలో కొందరు టీడీపీలో చేరగా, జయమంగళ వెంకటరమణ జనసేనలో చేరారు. మర్రి రాజశేఖర్, కర్రి పద్మశ్రీ పసుపు కండువా కప్పుకున్నారు. పోతుల సునీత బీజేపీలో చేరారు. గత కొన్ని నెలల నుంచి వీరి రాజీనామాలు అన్నీ ఛైర్మన్ వద్ద పెండింగులో ఉన్నాయి. తమ రాజీనామాలు ఆమోదించాలని వీరంతా కోరుతూ వచ్చారు. తమ రాజీనామాలను ఆమోదించాలని వారు మండలిలోనూ ఛైర్మన్ కు విజ్ఞప్తి చేశారు. జయ మంగళం వెంకట రమణ అయితే హైకోర్టుకు వెళ్లి తన రాజీనామాపై నిర్ణయం తీసుకోవాలని ఛైర్మన్ ఆదేశించాలని కోరారు. దీనికి ర్టు కూడా వీరి విషయం చూడాలని తెలిపిందిఅయితే వీరిని విచారించేందుకు స్పీకర్ నోటీసులు జారీ చేశారు. మరి వీరు విచారణలో ఏమి చెబుతారో చూడాల్సి ఉంది. వీరు తాము మనస్ఫూర్తిగా రాజీనామాలు చేశామని ఎన్నో సార్లు మీడియా ముందు చెప్పారు. అయితే ఇటీవల జయమంగళం వెంకట రమణ అయితే జగన్ తనకు దేవుడు అన్నట్లుగా మాట్లాడారు. దాంతో అది సంచలనంగామారింది. జయమంగళ వెంకట రమణ తన మనసు మార్చుకున్నారా లేదా అన్నది ఈ విచారణ సందర్భంగా తేలనుంది. అలాగే మరి కొందరి విషయమో కూటమిలో సరైన ఆదరణ లేదని అంటున్నారు. దాంతో వారు ఏమైనా ఆలోచిస్తున్నారా అన్నది కూడా చర్చకు వస్తోంది. వీరు ఛైర్మన్ ఎదుట తమ అభిప్రాయాన్ని ఎలా చెబుతారన్నది కూటమి నేతలకు కూడా కొంత టెన్షన్ గా ఉంది.మండలి ఛైర్మన్ ఎమ్మెల్సీలను విచారించి వారి రాజీనామాల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంటారా లేదా? అన్న దానిపై స్పష్టత రానుంది. అదే జరిగితే ఈ అయిదు సీట్లు ఖాళీ అవుతాయి. అపుడు వాటిలో ఎన్నికలు పెడితే తిరిగి కూటమికే ఆ సీట్లు వెళ్తాయి. ఈ విషయంలో ఇంత కాలం ఆగిన తరువాత ఇపుడు విచారణ అంటున్నారు అంటే వీరి విషయంలో తుది నిర్ణయం తీసుకోవాలని చూస్తున్నారా లేక విచారణ పేరిట సాగదీస్తారా? అన్న అనుమానాన్ని కూడా కూటమి నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. శాసనమండలిలో కూటమి కంటే వైసీపీ బలం ఎక్కువగా ఉంది. దీంతో రాజీనామాలు త్వరగా ఆమోదిస్తే మండలిలోనూ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేందుకు వీలు లేకుండా చేసుకోవచ్చన్నది కూటమి నేతల అభిప్రాయంగా ఉంది. మరి ఏం జరుగుతుందన్నది చూడాలి.

# 74 లక్షల ఓట్లు తొలగింపు

**చెన్నై - సూర్య వాస్తవం**




మరికొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తమిళనాడు రాష్ట్రంలో కేంద్ర ఎన్నికల సంఘం తుది ఓటరు జాబితాను అధికారికంగా విడుదల చేసింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పూర్తి చేసిన ఈసీ.. తాజా లెక్కలను బట్టి రాష్ట్రంలో మొత్తం 5.67 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించింది. అయితే గత లెక్కలతో పోలిస్తే ఈసారి 74 లక్షల మంది ఓటర్లు తగ్గడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.గతేడాది అక్టోబరు నాటికి తమిళనాడులో సుమారు 6.41 కోట్ల మంది ఓటర్లు ఉండేవారు. కానీ బోగస్ ఓట్ల ఏరివేత, రెండు చోట్ల ఓటు ఉన్నవారిని గుర్తించడం, మరణించిన వారి పేర్లను తొలగించే క్రమంలో ఎన్నికల సంఘం భారీ ప్రక్షాళన చేపట్టింది. డిసెంబరు 19న విడుదల చేసిన ముసాయిదా జాబితాలో ఒకేసారి 97 లక్షల పేర్లను తొలగించి, ఓటర్ల సంఖ్యను 5.43 కోట్లుగా తేల్చింది. దీనిపై అభ్యంతరాల స్వీకరణకు గడువు ఇచ్చింది. దరఖాస్తుల పరిశీలన అనంతరం.. అర్హులైన 27.53 లక్షల మందిని కొత్తగా చేర్చింది. అదే సమయంలో మరో 4.23 లక్షల అనర్హుల పేర్లను జాబితా నుంచి పూర్తిగా తొలగించింది.తాజాగా వెలువడిన తుది జాబితా ప్రకారం రాష్ట్రంలో పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్యే ఎక్కువగా ఉండటం విశేషం. మొత్తం ఓటర్లు 5.67 కోట్లు ఉండగా.. వారిల మహిళా ఓటర్లు 2.89 కోట్లు ఉన్నారని ఈసీ తెలిపింది. ఇక పురుష ఓటర్లు 2.77 కోట్లు ఉన్నట్లు వెల్లడిచింది. నియోజక వర్గాల వారీగా చూసుకుంటే.. చెంగల్‌పట్టు జిల్లా పరిధిలోని శోలింగనల్లూర్ స్థానం 5.36 లక్షల ఓటర్లతో అత్యధిక ఓటర్లున్న నియోజకవర్గంగా నిలిచింది. చెన్నైలోని హార్బర్ నియోజకవర్గం కేవలం 1.16 లక్షల ఓటర్లతో అత్యల్ప ఓటర్లున్న స్థానంగా నమోదైంది. తమిళనాడు ( ప్రస్తుత అసెంబ్లీ పదవీకాలం ఈ ఏడాది మే నెలతో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఏప్రిల్‌లోనే సార్వత్రిక ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. దీనికి సంబంధించిన అధికారిక షెడ్యూల్ మార్చి రెండో వారంలో వెలువడే సూచనలు కనిపిస్తున్నాయి. ఈసారి తమిళనాడు ఎన్నికల ముఖచిత్రం అత్యంత రసవత్తరంగా మారనుంది. అధికార డీఎంకే కూటమి, ప్రతిపక్ష అన్నాడీఎంకే ? బీజేపీ కూటమికి తోడుగా.. దళపతి విజయ్ స్థాపించిన కొత్త పార్టీ 'తమిళగ వెట్రి కళగం తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగుతుండటంతో ముక్కోణపు పోరు ఖాయంగా కనిపిస్తోంది. ఏకంగా 74 లక్షల ఓట్లు గల్లంతైన నేపథ్యంలో ఈ మార్పులు ఏ పార్టీకి లాభిస్తాయో, ఎవరికి నష్టం చేకూరుస్తాయో వేచి చూడాలి.

## వైయస్ విజయమ్మకు 'జగన్నాధుని జనయాత్ర' పుస్తకం అందజేత

### - వైఎస్ఆర్ రాష్ట్ర కార్యదర్శి రాచమల్లు రవిశంకర్ రెడ్డి



**పులివెందుల – సూర్య వాస్తవం:** వై.యస్.విజయమ్మని హైదరాబాద్‌లోని వారి స్వగృహంలో కలిసి జగనన్న పాదయాత్రపై తాను రచించిన "జగన్నాధుని జన యాత్ర" పుస్తకాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ "రాష్ట్ర కార్యదర్శి" రాచమల్లు రవిశంకర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. వాటిలో భాగంగా వైఎస్ విజయమ్మ రాచమల్లు రవిశంకర్ రెడ్డిని ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలతో మమేకం, నవరత్నాల రూపకల్పన, అన్ని వర్గాల ప్రజల కోసం రూపొందించిన పథకాలు తదితర వివరాలతో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి రాచమల్లు రవిశంకర్రెడ్డి ఆధ్వర్యంలో ఈ పుస్తకాన్ని రూపొందించిన పుస్తకాన్ని వైయస్ విజయమ్మకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఐమాక్స్ లైట్ల ఏర్పాటుతో వెలుగులమయమైన కుప్పం పట్టణం



**కుప్పం – సూర్య వాస్తవం:** కుప్పం పట్టణంలో ఐమాక్స్ లైట్ల ఏర్పాటుకు కుప్పం మున్సిపాలిటీ అధికారులు సంసిద్ధమయ్యారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన కూడళ్ళలో చూపర్లను ఆకట్టు కునేలా ఐమాక్స్ లైట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా 18,19వ వార్డులలోని ప్యాలెస్ సర్కిల్, బైపాస్ పరిధిలోని ఆర్ఆర్ మార్గం వద్ద బుధవారం ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేశారు. కుప్పం పట్టణ సుందరీకరణలో భాగంగా ఈ లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి శ్రీనివాస్ రావు తెలిపారు. ఈ లైట్లు ఏర్పాటు కార్యక్రమంలో 18,19వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్లు ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, జాకీర్ అహ్మద్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## క్రమ శిక్షణ కలిగిన కార్యకర్తలుగా సభ్యత్వ నమోదును జయప్రదం చేద్దాం

### - జనసేన సభ్యత్వ యజ్ఞంలో పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసిన జనసేన జిల్లా అధ్యక్షులు టి.సి.వరుణ్



**ఉరవకొండ – సూర్య వాస్తవం:** జిల్లా కేంద్రంలో టి.సి.వరుణ్ ఆధ్వర్యంలో యాదవ కళ్యాణ మండపంలో నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, అధ్యక్షతన అనంతపురం పార్లమెంట్ జనసేన పార్టీ ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథులుగా హాజరైన జనసేన ఉద్యమి సభ్యత్వ సమన్వయకర్త పసుపులేటి హరిప్రసాద్, పిఎసి సభ్యులు చిలకం మధుసూదన్ రెడ్డి జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలు.. సిద్ధాంతాలే. ప్రచారంగా ప్రజల్లోకి వెళ్దాం. ఔత్సాహికులైన యువకులు మహిళలకు పార్టీ సభ్యత్వం ఇద్దాం. రాష్ట్రంలోనే అనంతపురం పార్లమెంటును అగ్రగామిగా నిలుపుదాం. అధినేత పవన్ కళ్యాణ్ స్ఫూర్తిని అందుకుందాం. క్రమ శిక్షణ కలిగిన కార్యకర్తలుగా సభ్యత్వ నమోదును జయప్రదం చేద్దాం. పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసిన జనసేన జిల్లా అధ్యక్షులు టి.సి.వరుణ్, రెట్టింపు ఉత్సాహంతో పాల్గొన్న అన్ని నియోజకవర్గాల ఇన్చార్జిలు, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు, మండలాల అధ్యక్షులు, సభ్యత్వ నమోదు వాలంటీర్లు, వీరమహిళలు, జనసైనికులు.



## రైతు పక్షపాతిగా కూటమి ప్రభుత్వం

### - శనగల కొనుగోలు కేంద్రంన్ని ప్రారంభించిన బీటెక్ రవి



**సింహాద్రిపురం – సూర్య వాస్తవం:** అన్నదాతల శ్రేయస్సే లక్ష్యంగా, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి వారిని ఆదుకోవాలన్న దృఢ సంకల్పంతో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది.ఇందులో భాగంగా బుధవారం సింహాద్రిపురంలో మార్క్‌ఫెడ్ (మార్క్‌ఫెడ్) మరియు నాఫెడ్ (నాఫెడ్) ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని పులి వెందుల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి, పులివెందుల జడ్పిటిసి మా రెడ్డి లతా రెడ్డి,వేంపల్లె టీడీపీ ఇంచార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి, సింహాద్రిపురం



మార్కెట్ యార్డ్ చైర్మన్ బండి రామసురా రెడ్డి పాల్గొని కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు.రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంట దళారుల పాలై నష్టపోకూడదన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని నాయ కులు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరను ప్రతి ఒక్క రైతూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. సింహాద్రిపురం మండలంతో పాటు పరిసర గ్రామాల శనగ రైతులు తమ పంటను విక్రయించుకోవడానికి దూర ప్రాంతాలకు వెళ్లే ఇబ్బంది లేకుండా ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. గత ప్రభుత్వంలో రైతులు పడిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని,ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతిగా నిలుస్తోందని,గిట్టుబాటు ధర కల్పించి రైతులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని బీటెక్ రవి అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పుప్పాల శ్రీధర్ రెడ్డి, సింహాద్రిపురం సింగిల్ విండో అధ్యక్షుడు పీజీ గోపాల్ రెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టమోటా ప్రాసెసింగ్ - జోడింపుపై నైపుణ్య అభివృద్ధి

### - పరిశ్రమ సందర్శన



**పులివెందుల – సూర్య వాస్తవం:** ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాల వారి ఆధ్వర్యంలో "టొమోట ప్రాసెసింగ్, విలువ జోడింపుపై నైపుణ్య అభివృద్ధి" అనే ఐ.సి.ఏఆర్ షెడ్యూల్డ్ ఉప ప్రణాళిక ప్రాజెక్ట్‌లో భాగంగా పరిశ్రమ సందర్శన కార్యక్రమం బుధవారం ఫిబ్రవరి 25న జరిగింది. ఈ పరిశ్రమ సందర్శన కార్యక్రమంలో భాగంగా పులివెందుల, వేంపల్లె పరిసర ప్రాంతాలకు చెందిన ఔత్సాహిక ఎస్సీ కులాల యువత, రైతులుని




చిత్తూరు జిల్లాలో "ఫీల్ ఫ్రెష్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్" పరిశ్రమకు తీసుకొని వెళ్ళి టమోటా ప్రాసెసింగ్ చేసి టమోటా నుండి గుజ్జు, టమోటా ప్యూరీ తయారు చేయు విధానము, నిల్వ ఉంచే పద్ధతులు, ఎస్ఎఫ్టిక్ ప్యాకేజింగ్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్. మాధవ మాట్లాడుతూ టమోటో ప్రాసెసింగ్ విధానాన్ని తెలుసుకోవడం ఎంతో ముఖ్యమని, తద్వారా టమాటోల వృధా అరికట్టవచ్చని కార్యక్రమంలో అన్నారు. ఈ సందర్భంగా టమోటా ప్రాసెసింగ్ విధానాన్ని విచ్చేసిన ఔత్సాహిక ఎస్సీ కులాల వారు ప్రత్యక్ష పరిశీలన చేశారు. ఈ పరిశ్రమ సందర్శన కార్యక్రమం ద్వారా టమోటా ప్రాసెసింగ్ గురించి పూర్తిగా తెలిసిందని విచ్చేసిన ఔత్సాహిక ఎస్సీ కులాల వారు పేర్కొన్నారు. ఈ పరిశ్రమ సందర్శన కార్యక్రమానికి కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్. ఎమ్. మాధవ, ప్రాజెక్ట్ ఇన్చార్జ్ ఇంజినీర్ నజ్మా,అధ్యాపకుడు డాక్టర్ సాయి శ్రీనివాస్, పీడి డాక్టర్ రాజశేఖర్, పులివెందుల మరియు వేంపల్లె పరిసర ప్రాంతాలకు చెందిన ఔత్సాహిక ఎస్సీ కులాల వారు పాల్గొన్నారు.

## పేద, మెరిట్ విద్యార్థులకు కేసి. పుల్లయ్య పౌండేషన్ ఉపకార వేతనాలు

### - నిరుపేద అనాధలకు, దివ్యాంగులకు ప్రాధాన్యం



**పులివెందుల రూరల్ – సూర్య వాస్తవం:** కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ధార్మికరత్న కే.సి.పుల్లయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, లా, ఇంజనీరింగ్, మెడిసన్, పాలిటెక్నిక్, తదితర ఉన్నత విద్య చదువుకుంటున్న నిరుపేద మెరిట్ విద్యార్థులకు ప్రతి ఏడాది ఇచ్చే స్కాలర్ షిప్ లకు దరఖాస్తు చేసు కోవాలని వికలాంగుల నెట్ వర్క్ అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఉన్నత విద్యా కోర్సులు చదువుతున్న విద్యార్థులు తాము చదువుతున్న కోర్సుకు సంబంధించిన ముందు సంవత్సరపు లేదా సెమిస్టర్‌కు సంబంధించిన మార్క్స్ మెమో, స్టడీ సర్టిఫికెట్, పదవ తరగతి సర్టిఫికెట్, ఇతర విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, తదితర డాక్యుమెంట్లను స్కాన్ చేసి ఆన్ లైన్లో దరఖాస్తు చేసుకోవాలని, చివరి తేదీ ఫిబ్రవరి 28 అని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అనంతరం మెరిట్ విద్యార్థులను ఎంపిక చేసి, వారి ఫోన్ నెంబర్ కు సమాచారం ఇస్తారని, ఎంపికైన అభ్యర్థులకు మార్చి 22న, ప్రొద్దుటూరులో జరిగే స్వర్గీయ కె.సి పుల్లయ్య వర్ధంతి కార్యక్రమంలో స్కాలర్ షిప్ చెక్కులు అందజే స్తారని నిరుపేద అనాధలకు, దివ్యాంగులకు ప్రాధాన్యం ఇస్తారని, మెరిట్ విద్యార్థులు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వెబ్ అడ్రస్ kc pullaiahfoundation. org. in అనే వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.



## వివాహ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు

### - పార్టీలకు అతీతంగా ప్రజలతో మమేకమైన కాపు రామచంద్రారెడ్డి





**రాయదుర్గం– సూర్య వాస్తవం :** పట్టణంలోని కురిహిన శెట్టి కళ్యాణమండపంలో జకాతి కృష్ణ సోదరి కుమార్తె కావేరి బాబు వివాహ వేడుకల్లో రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. నూతన వధూ వరులను ఉపాధ్యక్షులు ఆశీర్వదించి అనంతరం పార్టీలకు అతీతంగా వివాహ వేడుకల్లో ప్రజలతో మమేకమై విందు కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గుమ్మగట్ట జడ్పిటిసి మహేష్ మాధవరెడ్డి జీవీ నాయుడు డాక్టర్ మల్లికార్జున కసంధుల కుమార్ వాల్మీకి పవన్ జనసేన నాయకులు పగడాల కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలి

**- దీనికోసం ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీ తీర్మానం చేయాలి**
**- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**




**రాయచోటి – సూర్య వాస్తవం:** వికసితభారత్ గ్యారెంటీ రోజ్గార్ అజీవిక మిషన్ గ్రామీణ పథకాన్ని రద్దు చేయాలని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా పునరుద్ధరించాలని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం రాయచోటిలో మీడియా సమావేశంలో తులసిరెడ్డి మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఒక విప్లవాత్మకమైన, చరిత్రా త్మకమైన పథకం అన్నారు. ఈ పథకం కాంగ్రెస్ పార్టీ మానస పుత్రిక.శ్రీమతి సోనియా గాంధీ మార్గదర్శకత్వంలో మన్మోహన్ సింగ్ ప్రధానిగా కాంగ్రెస్ నేతృత్వంలో యూపీఏ ప్రభుత్వం 2025లో ఈ చట్టాన్ని చేసిందన్నారు. ఈ పథకానికి ఆంధ్రప్రదేశ్ కు తల్లి బిడ్డల పేగు బంధం ఉందన్నారు. 2006 ఫిబ్రవరి 2వ తేదీన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో,ఉమ్మడి అనంతపురం జిల్లాలో, సింగనమల నియోజకవర్గంలో, సింగనమల మండలంలో బండ్లపల్లి గ్రామంలో డాక్టర్ మన్మోహన్ సింగ్, సోనియా గాంధీ, స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి సమక్షంలో ఈ పథకం ప్రారంభించబడిందన్నారు. ఉపాధి హామీ పథకం పల్లె ప్రజల పాశుపతాస్త్రం.గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు,నగరాలకు వలసలు నివారించి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిని కల్పించి, గ్రామీణ పేదరికం పూర్తిగా పారద్రో లాలని గ్రామీణులకు పనిచేసే హక్కు కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం అమలులోకి వచ్చిన తర్వాత చాలా మేరకు గ్రామీణ ప్రాంతాల నుండి వలసలు తగ్గిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వాల మీద ఆర్థిక భారం లేకుండా కేంద్ర ప్రభుత్వం 90 శాతం, రాష్ట్రప్రభుత్వం 10 శాతం నిధులు భరించే విధంగా ఈ పథకానికి రూపకల్పన జరిగింది.మొత్తం ఖర్చులో 60 శాతం కూలీలకు, 40 శాతం అభివృద్ధి పనులకు ఖర్చు చేసే విధంగా పథకానికి రూపకల్పన జరిగింది. గత 19 సంవత్సరాలలో గ్రామీణులకు ఉపాధి కల్పించడమే కాకుండా, గ్రామీణ ప్రాంతాలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఈ పథకం ద్వారా చేపట్టడం జరిగింది. వైకాపా పాలనలో గ్రామ సచివాలయ,రైతు భరోసా కేంద్రాల భవనాలు ఈ పథకం తోనే నిర్మించ బడ్డాయి. అదే విధంగా కూటమిపాలనలో 25వేల కిలో మీటర్ల గ్రామీణ రోడ్ల మరమ్మత్తులు, గోకులాలు, మినీ గోకులాలు ఈ పథకం ద్వారానే జరిగాయి.మహాత్మా గాంధీ దేశ స్వరాజ్యంతో పాటు గ్రామ స్వరాజ్యాన్ని కలలుగన్నారు. భారతదేశపు ఆత్మ గ్రామాలలో నివసిస్తుంది అన్నారు. గ్రామాలు బాగుంటేనే దేశం బాగుంటుందన్నారు.ఈ ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతాలకు కాబట్టి ఈ పథకానికి జాతిపిత పేరుతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అని పేరు పెట్టడం జరిగింది. దురదృష్టవశాత్తు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 2025 డిసెంబర్లో ఈ పథకం పేరు మార్చడమే కాకుండా,కేంద్ర నిధుల వాటాను 90 శాతం నుండి 60 శాతానికి తగ్గించింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అన్న పేరు తొలగించి వికసిత భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిక మిషన్ గ్రామీణ్ అనే పేరు పెట్టింది. కేంద్ర ప్రభుత్వ వాటాను 90 శాతం నుండి 60 శాతానికి తగ్గించింది.మహాత్మా గాంధీ పేరు తొలగించడం ఒక చారిత్రిక తప్పిదం.ఇది జాతిపితకు అవమానం.అంటే మొత్తం జాతికే అవమానం.వినాశకాలే విపరీత బుద్ధి అన్నారు పెద్దలు. పోగాలము దాపురించిన వాడు హితుల వాక్యము,అరుంధతిని,దీప నిర్వాణ గంధం వినడు,కనడు,మూర్కొనడు అని మిత్ర లాభంలో పరవస్తు చిన్నయ్య సూరి అంటారు.ఆ విధంగా పోగాలం దాపు రించి, వినాశకాలం దాపు రించిన కారణంగా మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరు తొలగించిందని విరుచు కుపడ్డారు. నిధులలో కేంద్ర ప్రభుత్వం వాటా తగ్గించిన కారణంగా రాబోవు రోజుల్లో రాష్ట్రాలపై ఆర్థిక భారం పడి చివరకు ఈ పథకమే కాలగర్భంలో కలిసిపోయే ప్రమాదం ఉందన్నారు. మోడీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుంది.అందుకోసమే కొత్త పథకాన్ని రద్దుచేసి పాత పథ కమైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధాతధంగా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పథకాన్ని రద్దు చేస్తూ పాత పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించడం జరిగింది . అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు. ఈ పాపంలో బిజెపితో పాటు బిజెపికి మద్దతు ఇస్తున్న టిడిపి, జనసేన, వైకాపాల పాత్ర కూడా ఉందని ధ్వజమెత్తారు.కొత్త పథకాన్ని రద్దుచేసి పాత పథకాన్ని పునరుద్ధరించే వరకు ఈ ఉద్యమం కొనసాగు తుందని, అప్పటికీ కాకపోతే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కొత్త పథకాన్ని రద్దుచేసి పాత పథ కమైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధాతధంగా అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. మీడియా సమావేశంలో ఏపీ సి సి ప్రధాన కార్యదర్శి అల్లా బకష్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎస్ఎండి గౌస్, చెన్నకృష్ణ,కత్వాల్ రఫీ,దర్బార్, మన్సూర్ అలీ ఖాన్, నూరుల్లా, బషీర్, అజ్మతుల్లా, హుజూర్, రమణ, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, బండారు వెంకటేశు, నామా వినయ్ తదితరులు పాల్గొన్నారు.



## సిరిగిరెడ్డి కల్యాణ వేడుకల్లో వైసీపీ శ్రేణులు

**- పులివెందులలో ఘనంగా జగదీశ్వర్ రెడ్డి**
**- నిర్మలాదేవి వివాహవేడుకలు**



**తొండూరు – సూర్య వాస్తవం:** తొండూరు మండలం, ఊడవగండ్ల గ్రామానికి చెందిన సిరిగిరెడ్డి తులశమ్మ సిరిగిరెడ్డి సదాశివారెడ్డి దంపతుల ఏకైక పుత్రుడు జగదీశ్వర్ రెడ్డి వివాహం నిర్మలాదేవితో బుధవారం పులివెందులలోని శ్రీకర్ కళ్యాణమండపంలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ శుభకార్యానికి రాజకీయ, సామాజిక రంగాల ప్రముఖులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. వైసీపీ తొండూరు మండల ఇంచార్జ్ వై ఎస్ మదన్ మోహన్ రెడ్డి కడప జిల్లా ఉపాధ్యక్షుడు డి.వి. శశికాంత్ రెడ్డి ప్రత్యేకంగా విచ్చేసి వధూవరులకు అక్షింతలు చల్లి, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో కలకాలం ఆనందంగా జీవించాలని దీవించారు. ఈ వేడుకలో పులివెందుల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గోటూరు చిన్నప్ప, పులివెందుల పట్టణ వైసిపి ఇన్చార్జి హల్ గంగాధర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సర్వోత్తమ్ రెడ్డి, వైకాపా నాయకులు రామిరెడ్డి పుల్లారెడ్డి, శశికాంత్ రెడ్డి అభిమానులు, బంధుమిత్రులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారి సమక్షంలో వివాహ వేడుక మరింత ఆనందోత్సాహాలతో నిండిపోయింది.

## సీఐ విక్రమ సింహాపై చర్యలు తీసుకోవాలి....!

**- కోర్టు విధులు బహిష్కరించిన న్యాయవాదులు**



**పత్తికొండ టౌన్ – సూర్య వాస్తవం :** ఓ కేసు విషయంలో పోలీస్ స్టేషన్కి వెళ్లిన న్యాయవాదిపై దాడి చేసిన కర్నూలు 4వ పట్టణ సిఐ విక్రమ సింహాపై ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని పత్తికొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మధుబాబు, సీనియర్ న్యాయవాదులు కారప్ప, సత్యనారాయణ, మల్లికార్జున, లక్ష్మన్న డిమాండ్ చేశారు. బుధవారం పత్తికొండ బార్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షులు మధుబాబు ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కర్నూలు న్యాయవాది ఎం. పవన్కుమార్ ఓ కేసు విషయంలో నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ కి వెళ్లగా, అక్కడ సిఐ విక్రమ సింహ న్యాయవాది పవన్ కుమార్ను పరుశ పదజాలంతో దూషించడమే కాకుండా దాడి చేసి గాయపరిచారని వివరించారు. గాయపడిన న్యాయవాది పవన్ కుమార్ వెంటనే ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నారని తెలిపారు. న్యాయవాది పవన్ కుమార్పై దాడి చేసిన సిఐ విక్రమ సింహాపై ఉన్నత అధికారులు ఇంతవరకు చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ముఖ్యంగా న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకురావాలని తెలిపారు. సీఐ విక్రమ సింహ పై చర్యలు తీసుకు నేంతవరకు మూడు రోజులపాటు కోర్టు విడుదలను బహిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నాగభూషణం రెడ్డి, కృష్ణయ్య, రంగస్వామి, నరసింహాచారి, బాలబాష, ప్రసాద్, సుధాకృష్ణ, శ్రీనివాసరెడ్డి, అరుణ్, మధు, నాగరాజు, నాగభూషణం, రజాక్, వీరేష్ పాల్గొన్నారు.

## భోగేశ్వరస్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు

**పామిడి– సూర్య వాస్తవం:** స్థానిక పామిడి పట్టణంలోని భోగేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు దేవాలయ కార్యనిర్వహణాధికారి అంగదాల కృష్ణయ్య,ఆలయకమిటీ చైర్మన్ పి.భారతి,పి ఆర్ కె బాబు దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక అధికారి నార్పల కార్యనిర్వాహణాధికారి రంగస్వామినాయుడు సమ క్షంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. హుండలో రూ.1,58 811లు నగదు, 3గ్రాముల బంగారం, 94 గ్రాములు వెండి కలదని, ఈ మొత్తం గత ఏడాది మార్చి 28 నుండి ఈసంవత్సరం ఫిబ్రవరి 25 వరకు భక్తాదులు వేసిన ముడుపుల రూపంలో వచ్చినదని ఆలయ కార్యనిర్వహణాధికారి ఏ.కృష్ణయ్య కమిటీ చైర్మన్ పి.భారతి తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ పి.భారతి, పిఆర్ కె బాబు, సభ్యులు, రామలక్ష్మి, సురేష్, పవన్ కుమార్, రామాంజినేయులు, అర్చకులు సోమశంకర్, రాము స్వామి, చంద్రమౌళి, అనిల్ స్వాములు, పి.సురేష్ కుమార్, శ్రీరాములు, భక్తులు మల్లికార్జున, అది, శేషు, పాల్గొన్నారు.



## మాజీ చైర్మన్ ఈశ్వరయ్యను పరామర్శించిన వైఎస్ జగన్



**పులివెందుల – సూర్య వాస్తవం:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బుధవారం పులి వెందులలో పర్యటించారు. ఈ సందర్భం గా అనారోగ్యంతో బాధపడుతున్న సింగిల్ విండో మాజీ చైర్మన్ ఈశ్వరయ్యను ఆయన నివాసంలో జగన్ మర్యాదపూర్వకంగా పరామర్శించారు. ఈశ్వరయ్య ఆరోగ్య పరిస్థితిని జగన్ అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం తీసుకుంటున్న చికిత్స వివరాలను అడిగి,ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈశ్వరయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు.పార్టీ కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఈశ్వరయ్య చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. జగన్ వెంట కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి,సతీష్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్,పార్టీ ముఖ్య నాయకులు,స్థానిక వైకాపా ప్రతినిధులు మరియు కార్యకర్తలు ఉన్నారు.తమ ప్రియతమ నేత రాకతో ఈశ్వరయ్య నివాసం వద్ద సందడి నెలకొంది. నేతను చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

## మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**ఉరవకొండ – సూర్య వాస్తవం:** స్థానిక మండల పరిధిలో వైయస్సార్సీపి మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని వైఎస్ఆర్సిపి అభిమానుల నడుమ ఘనంగా జన్మదిన వేడుకలు ఆయన స్వగృహం నందు అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి అనిమిరెడ్డిపల్లి సర్పంచ్ ఎర్రి స్వామి, అంకంపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ రుద్రానంద, పురుషోత్తం, నాగరాజు, దుద్దేగుంట గ్రామ నాయకులు ఆదియేప్ప, మురళి, వీరాంజ నేయులు, లక్ష్మన్న జీడిపల్లి గ్రామ వైయస్సార్ సిపి నాయకులు గంగాధరు మహేంద్ర అశోక్ పరివర్ధన్ తదితరులు పాల్గొని విశ్వేశ్వర్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడమైనది.

## కూరగాయల మార్కెట్‌కు స్థలం కేటాయించండి

**- కలెక్టర్‌ని కోరిన మార్కెట్ కమిటీ చైర్మన్**



**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం:** లక్కిరెడ్డిపల్లి మండలంలో కలెక్టర్ పర్యటనలో భాగంగా పెద్దపల్లి దగ్గర కలెక్టర్‌ని కలిసి కూరగాయల సంత జరుపుకోవడానికి స్థలం కేటాయిం చాలని లక్కిరెడ్డిపల్లి మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్ఎండి షఫినాయక్ కోరారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన కలెక్టర్ తక్షణమే తాసిల్దార్ కు ప్రభుత్వ స్థలంలో 50 సెంట్లు గుర్తించవలసిందిగా ఆదేశాలు ఇవ్వడం జరిగింది అని చైర్మన్ షఫీ నాయక్ తెలియజేశాడు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు యనమల మదనమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటే మంచి భవిష్యత్తు




**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం:** యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎస్ఐ గోల్కొండ శోభ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో 9 10 ఇంటర్ విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శోభ మాట్లాడుతూ చదువుకునే వయసులో గంజాయి డ్రగ్స్ ఇలాంటి వాటికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు అన్నారు. చాలా మంది చిన్న వయసులోనే మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురవుతున్నారని ఆమె హెచ్చరించారు. అంతేకాకుండా చిన్న వయసులో డ్రగ్స్ అలవాటు పడితే జీవితము సర్వనాశనం అవుతుందన్నారు. తల్లిదండ్రులు పిల్లల పైన ఎంతో ఆశలు పెట్టుకుంటారని వారి ఆశలను అడియాశలు చేయొద్దన్నారు. బాగా చదువుకొని మంచి మార్కులు సాధించి భవిష్యత్తులో గొప్పవారు కావాలని ఆమె హితోపదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వరాల రమేష్ ఉపాధ్యాయులు నాగయ్య శివలీల జాఫర్ ప్రదీప్ హెడ్ కానిస్టేబుల్ బాలరాజు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో

# భక్తులకు ఇబ్బందులు కలిగించకూడదు..

- ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్
- క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పరిశీలన..
- అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే



**శ్రీ సత్య సాయిబ్యూరో – సూర్య వాస్తవం :** కదిరి శ్రీమత్ ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవ వేడుకల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎటువంటి లోపాలు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. శ్యాంప్రసాద్, జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అధికారులకు ఆదేశించారు. శ్రీమత్ ఖాద్రి లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల వేడుకలు ఈనెల 27 నుండి, మార్చి 13 వరకు 15 రోజులపాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న సందర్భంగా బుధవారం జిల్లా కలెక్టర్ ఎం శ్యాంప్రసాద్ జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్, ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌తో కలిసి లక్ష్మీ నంసింహస్వామి దేవస్థానంలో క్షేత్రస్థాయిలో ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా చేపట్టవలసిన ఏర్పాట్లు జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఈ బ్రహ్మోత్సవాలకు ఆంధ్ర కర్ణాటక తమిళనాడు నుంచే కాక వివిధ రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున భక్తులు రానున్నడంతో, భక్తులను దృష్టిలో ఉంచుకొని భద్రతా ఏర్పాట్లు, రాకపోకల నియంత్రణ, క్యూలైన్ వ్యవస్థ, బ్యారికేడింగ్, అత్యవసర మార్గాలు, పార్కింగ్ స్థలాలు తదితర అంశాలను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఎమ్మెల్యేతో కలిసి క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ బ్రహ్మోత్సవాలు 15 రోజులపాటు జరు గుతున్న నేపథ్యంలో అందరి సహకారంతో ఉత్సవాలను ఎటువంటి లోపాలు లేకుండా విజయవంతం చేయాలని సూచించారు ఈ బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి వస్తున్న భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు ముందస్తుగా చేసుకోవాలని అధికారులకు ఆదేశించారు అన్ని శాఖల సమన్వయంతో ఈ బ్రహ్మోత్సవాల వేడుకలు విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈ బ్రహ్మోత్సవాలు ఎంతో పకడ్బందీగా నిర్వహించడం జరుగుతుందని ఈ వేడుకలకు పటిష్టమైన పోలీస్ భద్రతా ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు, గర్భగుడి క్యూలైన్లు, ఘాట్ ప్రాంతం, ప్రధాన రహదారులు, పార్కింగ్ ప్రాంతాలు, కంట్రోల్ రూమ్ ఏర్పాట్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ తదితర అంశాలను సమీక్షించారు. ఇతర శాఖలతో సమన్వయం చేస్తూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు, స్పెషల్ పార్టీ ఫోర్స్, రోప్ పార్టీ, లా అండ్ ఆర్డర్ సిబ్బందితో విస్తృత భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలను కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి నిరంతర నిఘా ఉంచుతున్నామని తెలిపారు. పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్ ద్వారా మార్గదర్శకాలు, వైద్య శిబిరాలు, త్రాగునీటి సదుపాయాలు, సముచిత లైటింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వృద్ధులు, మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇరువైపులా బ్యారికేడ్లు ఏర్పాటు చేసి, భక్తుల నియంత్రణకు పటిష్ట బందోబస్తు కల్పిస్తున్నామని తెలిపారు. భక్తులు పోలీసు సూచనలను పాటిస్తూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మాట్లాడుతూ శ్రీమత్ ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల తో పాటు రథోత్సవ కార్యక్రమం ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని కదిరి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు రాష్ట్రంలోనే ఎంతో ప్రత్యేకమైన స్థానం ఉందని ఈ వేడుకలకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు సిద్ధం చేసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అందరి సహకారంతో ఈ బ్రహ్మోత్సవాలు విజయవంతం అయ్యే విధంగా చూడాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ , ఎమ్మెల్యే తో పాటు, జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఖాద్రి ఆలయ ప్రధాన అర్చకులు నృసింహచార్యులు, పార్థ సారథిచార్యులు డి.ఎస్.పి శివన్నారాయణ స్వామి, మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్,, సిఐలు నారాయణరెడ్డి, నిరంజన్ రెడ్డి, నాగేంద్ర, ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి, డి సి హెచ్ ఎస్ డాక్టర్ మధుసూదన్ అన్ని శాఖల అధికారులు, ఆలయ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## నందీశ్వరాలయ విగ్రహ ప్రతిష్ఠా

# మహోత్సవంలో మాజీ సీఎం వైఎస్ జగన్

- రూ.6 కోట్లతో నిర్మించిన ఆలయం
- జగన్మోహన్ రెడ్డికి బ్రహ్మరథం పట్టిన భక్తులు
- దేవాలయాలు మన సంస్కృతి సంప్రదాయాలు





**వేంపల్లి – సూర్య వాస్తవం :** పులివెందుల నియోజకవర్గం వేంపల్లి మండలం నందిపల్లె గ్రామం లో ఆధ్యాత్మిక శోభ వెల్లి విరిసింది. సుమారు 6 కోట్ల రూపాయల భారీ వ్యయంతో అత్యంత సుందరంగా నిర్మించిన నందీశ్వర ఆలయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకలకు ఆలయ నిర్వాహకుల ఆహ్వానం మేరకు ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నందిపల్లి గ్రామానికి చేరుకున్న జగన్ మోహన్ రెడ్డికి నందీశ్వర ఆలయ కమిటీ చైర్మన్ మారం శ్రీకాంత్ రెడ్డి,వైకాపా నాయకులు మరియు కార్యకర్తలతో వేద పండితులచే పూర్ణ కుంభంతో, గజ మాలలతో ఘనంగా స్వాగతం పలికారు. తమ ప్రియతమ నేతను చూసేందుకు స్థానిక ప్రజలు, అభి మానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠా హోమంలో మాజీ సీఎం జగన్ పాల్గొన్నారు. శాస్త్రోక్తంగా జరుగుతున్న హోమ పూజా కార్యక్రమాల్లో కూర్చుని,లోక కల్యాణం కోసం నిర్వహించిన పూర్ణా హుతిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆయనకు ఆశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ దేవాలయాలు మన సంస్కృతి సంప్రదాయాల పత్రికలని పత్తి మార్గం ద్వారా సమాజంలో శాంతి సౌభ్రాతృత్వం పెంచుతూ పెంపొందుతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఆలయ అభివృద్ధి ఉన్న నిర్మాణం ద్వారా ఆధ్యాత్మిక చైతన్యం మరింత విస్తరిస్తుందని తెలిపారు. నూతన విగ్రహ ప్రతిష్ట కుంభాభిషేక మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆలయ కమిటీ చైర్మన్ మారం శ్రీకాంత్ రెడ్డిని కమిటీ సభ్యులను అభినందించారు. గ్రామ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ శ్రీ నందీశ్వర స్వామి వారి కృపాకటాక్షాలు సమాప్త ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి వేల్పుల మండల వైకాపా నాయకులు వేల్పుల రాము వేముల మండల వైకాపా నాయకులు సాంబశివారెడ్డి వేంపల్లి మండలంతో పాటు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి భక్తులు,వైకాపా శ్రేణులు భారీగా తరలివచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ మారం శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. నందిపల్లెలో ఇంతటి భవ్యమైన ఆలయాన్ని నిర్మించడం,ఆ ప్రతిష్ఠా మహోత్సవంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాల్గొనడం గ్రామ ప్రజలందరికీ ఎంతో సంతోషా న్నిస్తోందని స్థానిక నాయకులు ఆనందం వ్యక్తం చేశారు.



## మణికంఠునికి పంచామృతాభిషేకాలు

- ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చిన మణికంఠుడు



**పులివెందుల – సూర్య వాస్తవం :** పులివెందుల పార్నపల్లి రోడ్డు కోటి సమాధి సమీపంలో కొలువై ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామికి విశేష పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయా స్తమాన ఆలయ ప్రధాన అర్చకులు సాయి, మధు, గురుస్వామి వెంకట రామిరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకం, సహస్రనామార్చన, బిల్వ అర్చన, అష్టోత్ర శతనామావళి,తదితర పూజ కైకర్యాల అనంతరం అయ్యప్ప స్వామి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గురుస్వామి వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో కార్తీక మాసం, 365 రోజులలో ప్రతి నిత్యము బుధవార రోజులలో స్వామివారికి విశేష పూజలు ధూప దీప నైవేద్యాలు భక్తుల సహాయ సహకారాలతో భక్తిశ్రద్ధలతో నిర్వహించడంగ జరుగుతోందన్నారు. ప్రతి మాసంలో అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రంలో విశేష పూజలు కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను అయ్యప్ప స్వాములకు భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## క్రైస్తవం ఎప్పుడు కులాలను మతాలను మార్చుదు

- త్రివర్ణ పతాకంలో మూడు రంగుల మాదిరి మనమంతా ఒక్కటే
- దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్




**పులివెందుల – సూర్య వాస్తవం :** క్రైస్తవ్యం కులం కాదు మతము కాదు మోక్షానికి మార్గం చూపిస్తుందని, త్రివర్ణ పతాకంలో మూడు రంగుల మాధురి మనమంతా ఒకటేనని దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ క్రైస్తవం ఎప్పుడు కులాలను మతాలను మా ర్చుదు క్రైస్తవ్యానికి కులం లేదు మతం లేదు అన్నారు. ప్రపంచ శాంతి కోసం తపించే క్రైస్తవుల రక్షణ సువార్త ప్రచారాన్ని కొంతమంది వ్యక్తులు అడ్డుకోవడం చాలా దారుణమన్నారు. క్రైస్తవమనేది కులం కాదు మతం కాదు క్రైస్తవం అనేది మోక్షానికి మార్గం చూపించేది తప్ప కుల మతాలను మార్చదని అందరము సహోదర భావంతో మూడు రంగుల జెండా ఎలా ఉందో అలా అందరం కలిసి మెలిసి ఉండాలని క్రైస్తవులపై దాడిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఖండిస్తున్న అన్నారు. అట్టివారి పై చట్టబద్ధంగా కఠినంగా శిక్షించాలని ,భారతదేశంలో ప్రతి ఒక్కరము భారతీయ పౌరులుగా మన మతాలను మన గౌరవించుకుంటూ పరమతాలను ఎంత అయిన గౌరవించాల్సిన అవసరం ఉంది అన్నారు. కనుక మనమందరము మనల్ని గౌరవించుకుంటూ ఇతరులను గౌరవిస్తూ ఈ సమాజంలో జీవించాలని తెలిపారు. క్రైస్తవుల మనోభావాలను దెబ్బతీసి భయం కలిగిస్తున్న వీరిని చట్టపరంగా శిక్షించాలి ఆయన డిమాండ్ చేశారు.

## రైతు ఐడి తప్పనిసరి

- శనగ కొనుగోలు కోసం నమోదు ప్రారంభం
- మండల వ్యవసాయ అధికారి ఆర్.డి. జగదీష్ బాబు



**కణేకల్ – సూర్య వాస్తవం:** రబీ సీజన్‌లో శనగ సాగు చేసిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. మార్కెట్‌లో ధరల మార్పులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు మద్దతుగా ప్రభుత్వం జోక్యం చేసుకుని ఆంధ్రప్రదేశ్ మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక "పప్పు సెనగ కొనుగోలు కేంద్రాలు" ఏర్పాటు చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఆర్.డి. జగదీష్ బాబు తెలిపారు.ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం క్వింటాల్‌కు రూ.5,875 చొప్పున శనగను నేరుగా రైతుల నుంచే కొనుగోలు చేయనుంది. మధ్యవర్తుల జోక్యం లేకుండా పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ నిర్వహించబడుతుందని అధికారులు పేర్కొన్నారు. రైతులు తమ పంటను ముందుగా నమోదు చేసుకుని, నాణ్యత ప్రమాణాలు పాటించేలా శుభ్రపరిచి తీసుకురావాలని సూచించారు. శనగ పంట నమోదు చేసుకున్న రైతులు తమ సమీపంలోని రైతు సేవా కేంద్రాలు ద్వారా సీఎం ఏఐడి యాప్‌లో నమోదు ప్రక్రియ పూర్తి చేయాలి. నమోదు చేసిన రైతులకు కొనుగోలు తేదీ, సమయం వంటి వివరాలు ముందుగానే తెలియజేయ బడతాయి. తేమ శాతం, ధాన్యం నాణ్యత వంటి ప్రమాణాలను పరిశీలించి కొనుగోలు చేపట్టబడుతుందని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది.రైతులు చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా ముందుగానే నమోదు పూర్తి చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు మరియు మండల వ్యాప్తంగా ప్రతి రైతుకు 11 అంకెల "ఫార్మర్ ఐడి" (రైతు గుర్తింపు సంఖ్య) నమోదు ప్రక్రియ కొనసాగుతోంది.ఈ కార్యక్రమాన్ని ఏపీ ఎఫ్ ఆర్ ఎస్ ఆధ్వర్యంలో చేపట్టారు అని వ్యవసాయ అధికారి జగదీష్ బాబు తెలిపారు.రైతు ఐడి లేకుండా భవిష్యత్తులో ప్రభుత్వ పథకాల లబ్ధి పొందడం సాధ్యం కాదని అధికారులు హెచ్చరించారు. ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర, సంక్షేమ పథకాల ప్రయోజనాలను అందరూ పొందేలా రైతులు చురుకుగా స్పందించాలని మండల వ్యవసాయ అధికారి ఆర్.డి. జగదీష్ బాబు విజ్ఞప్తి చేశారు. శనగ కొనుగోలు కేంద్రాలు మరియు రైతు ఐడి నమోదు వంటి కార్యక్రమాలు రైతుల ఆదాయాన్ని స్థిరపరచడమే లక్ష్యంగా చేపట్టినవని, అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు కోరుతున్నారు.



# అన్నపూర్ణ స్టూడియోలో మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ..

తెలుగు సినీ ఇండిస్ట్రీలో సాంకేతికత కొత్త పుంతలు తొక్కడానికి సిద్ధమైంది. 'అవతార్' సహా ఎన్నో హాలీవుడ్ సినిమాలను మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ సాయంతో తీస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకూ తెలుగు మేకర్స్ ఈ సాంకేతికత కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సి వచ్చేది. ఇప్పుడు హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఈ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి ఎంఅండ్ఎం క్యాప్ ల్యాబ్‌ను బుధవారం ఆవిష్కరించారు. మహేశ్‌బాబు కథానాయకుడిగా రూపొందిస్తున్న 'వారణాసి'లోని కీలక సన్నివేశాలను అక్కడ తీసినట్లు తెలిపారు. అన్నపూర్ణా స్టూడియోస్, శోభు యార్లగడ్డ మిహిరా విజువల్ ల్యాబ్స్, హాలీవుడ్ కంపెనీ యానిమాట్రిక్ ఫిల్మ్ డిజైన్ సంయుక్తంగా ఈ సాంకేతికతను అందుబాటులోకి తెచ్చాయి. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ.. 'అంతర్జాతీయ సినీ నిర్మాణ సంస్థలకు భారత్ నుంచే అత్యుత్తమ సాంకేతిక నిపుణులు వెళ్తున్నారు. అయితే, ఆ అధునాతన సౌకర్యాలు మాత్రం మనకు ఉండటం లేదు. 'బాహుబలి', 'ఈగ' వంటి సినిమాలు తీస్తున్నప్పుడు మనకు గనుక మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ సౌకర్య ఉంటే ఇంకా ఉత్తమంగా ఎలా చేయొచ్చా? అనుకునేవాడిని. ఇప్పుడు ఇది మనకు అందుబాటులోకి వచ్చింది. ఇండియన్ ఫిల్మ్‌మేకర్స్ ఆలోచనాధోరణి అత్యుత్తమ స్థాయికి తీసుకెళ్లవచ్చు.

– ప్రపంచవ్యాప్తంగా ఉన్న మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ స్టూడియోలను నేను సందర్శించా. ఏ అండ్ ఎం అద్భుతంగా టెక్నాలజీని అందిస్తోంది. ఇప్పటికే 'వారణాసి' కోసం ఈ సౌకర్యాన్ని వినియోగించుకుని కీలక సన్నివేశాలను తీశా. అవి అద్భుతంగా వచ్చాయి' అని రాజమౌళి అన్నారు. భారతీయ సినీ ప్రయాణంలో ఇదొక మైలురాయి అని కథానాయకుడు నాగార్జున అభివర్ణించారు. రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న 'వారణాసి' వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# 'భోగి' శర్వానంద్ ఫస్ట్ లుక్ విడుదల




శర్వానంద్ నటిస్తున్న 'భోగి' చిత్రం నుండి కీలక అప్‌డేట్ ఒకటి బయటికి వచ్చింది. తాజాగా చిత్రబృందం ఈ సినిమా నుండి శర్వా ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. విడుదల తేదీని కూడా ప్రకటించారు. ఈ సినిమాను ఆగస్టు 28న థియేటర్లకు తీసుకు వస్తున్నట్లు తెలిపారు. సంపత్ నంది దర్శకత్వంలో... 1960 నాటి కథా నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో శర్వా ఇదివరకు ఎప్పుడూ కనిపించని పాత్రలో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.

హైదరాబాద్‌లో భారీ యాక్షన్ సీన్స్ చిత్రీకరిస్తున్నారు. అనుపమా పరమేశ్వరన్, డింపుల్ హయతి ఈ సినిమాలో కథానాయికలుగా నటిస్తున్నారు. భీమ్స్ సంగీతం అందిస్తున్నారు.

# 'జాంబీ రెడ్డి 2' సిద్ధమైంది



తేజ సజ్జ నటించిన 'జాంబీ రెడ్డి'కి సీక్వెల్‌గా 'జాంబీ రెడ్డి 2' సిద్ధమవుతోంది. ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ పనులు పూర్తయ్యాయని తెలుస్తోంది. జాంబీ రెడ్డి దర్శకుడు ప్రశాంత్ వర్మ ఈ సీక్వెల్‌కు కథను అందించారు, మొదటి భాగాన్ని ప్రశాంత్ వర్మ స్వయంగా డైరెక్ట్ చేశారు, కానీ ఈ రెండో భాగాన్ని ఒక 'సర్ప్రైజింగ్ డైరెక్టర్' హ్యాండిల్ చేయబోతున్నారు. ఆ డైరెక్టర్ ఎవరనే సస్పెన్స్‌ను మేకర్స్ ప్రస్తుతానికి సీక్రెట్‌గా ఉంచారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టి.జి. విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మొదటి భాగం రాయలసీమ నేపథ్యంలో సాగింది. తాజాగా వస్తోన్న ఈ రెండో భాగం అంతకు మించి 'వైల్డ్'గా, భారీ స్థాయిలో ఉండబోతోందని సమాచారం.



## 100 పైగా తేడాతో గెలిస్తేనే సెమీస్ రేసులో..

# టీమ్‌ఇండియాకు ఫేవర్!



చెన్నైలోని ఎంఎం చిదంబరం స్టేడియం..! స్పిన్‌కు పెట్టింది పేరు. అది ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) అయినా, టెస్టు మ్యాచ్ లు అయినా..! ఇక్కడి పిచ్ నెమ్మది. కానీ, గురువారం జింబాబ్వేతో టి20 ప్రపంచ కప్ లో టీమ్ ఇండియా కీలక మ్యాచ్ ఆడబోతోంది. అసలే జింబాబ్వే జోరు మీదుంది. ఆస్ట్రేలియా వంటి జట్టును ఓడించింది. మరోవైపు టీమ్ ఇండియా గురువారం నాటి సూపర్ 8 మ్యాచ్ లో గెలవకుంటే ఇక ఇంటికే అనే పరిస్థితి. అది కూడా మామూలు గెలుపు కాదు..! ఏకంగా వందకు పైగా పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇలాంటి పరిస్థితుల్లో స్పిన్ బలం బాగానే ఉన్న జింబాబ్వేను మట్టికరిపించడం అంటే మాటలు కాదు. అందుకనే పిచ్ చిదంబర రహస్యంలా కాకుండా చూస్తున్నట్లు తెలుస్తోంది. ఆ ఓటమి.. ఈసారి గెలుపు సవాల్ ఆదివారం సూపర్ 8 మ్యాచ్ లో దక్షిణాఫ్రికాతో ఏకంగా 76 పరుగుల తేడాతో ఓడిపోవడం రన్ రేట్ పరంగా టీమ్ ఇండియా సెమీస్ అవకాశాలను క్లిష్టం చేసింది. అందుకని టీమ్ ఇండియాకు జింబాబ్వేతో పాటు వెస్టిండీస్ తో జరగాల్సిన మ్యాచ్ లు చాలా కీలకంగా మారాయి. అందుకనే ముందుగా జింబాబ్వే గండం తప్పేలా స్పిన్ పిచ్ ను బ్యాటింగ్ కు అనుకూలంగా మార్చేలా చూస్తున్నారు. వెస్టిండీస్ లా బాదేస్తేనే.. రెండు రోజుల కిందట సూపర్ 8 మ్యాచ్ లో జింబాబ్వేపై వెస్టిండీస్ 254 పరుగుల భారీ స్కోరు చేసింది. జింబాబ్వేపై పిచ్ బ్యాటింగ్ కు ఏమాత్రం అనుకూలించినా టీమ్ ఇండియా బ్యాట్స్ మెన్ కూడా ఇలానే చెలరేగే చాన్సుంది. అందుకనే చిదంబరం స్టేడియంలో దేశవాళీ మ్యాచ్ లకు వాడని పిచ్ ను జింబాబ్వే తో మ్యాచ్ కు ఉపయోగించనున్నట్లు సమాచారం. బంతి బ్యాట్ మీదకు వస్తే.. టీమ్‌ఇండియా హిట్టర్లు మిగతా పనిచూసుకుంటారు. తర్వాత బౌలర్లు ఎలాగూ చెలరేగుతారు. అప్పుడు 100కు పైగా టీమ్‌ఇండియా మొదట జింబాబ్వేపై, అనంతరం వెస్టిండీస్ పై గెలిస్తే సరిపోదు. అటువైపు దక్షిణాఫ్రికా కూడా రెండు మ్యాచ్ లలోనూ గెలవాలి. అప్పుడు మన జట్టు నేరుగా సెమీస్ కు వెళ్తుంది. వెస్టిండీస్ మీద దక్షిణాఫ్రికా ఓడితే మనకు ఇబ్బందే. జింబాబ్వే ముందుగానే రేసు నుంచి ఔట్ అవుట్ అయితే.. ఈ మూడు జట్లు నాలుగేసి పాయింట్లతో ఉంటాయి. దక్షిణాఫ్రికా గనుక తడబడి వెస్టిండీస్, జింబాబ్వే చేతిలో ఓడితే.. భారత్-వెస్టిండీస్ సెమీస్ కు వెళ్తాయి. మన జట్టు జింబాబ్వేపై ఓడి విండీస్ పై గెలిస్తే ఈ మూడు జట్లు 2 పాయింట్లతో ఉండి, దక్షిణాఫ్రికాను సెమీస్ కు (పరోక్షంగా) పంపిస్తాయి. నెట్ రన్ రేట్ ప్రకారం వీటిలో 2 జట్లు సెమీస్ చేరతాయి.



## ఉద్యానవన పంటలు సాగు చేసే
# రైతులకు డ్రిప్ ఇరిగేషన్ ఎంతో లాభదాయకం

### - అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్




**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** ఉద్యానవన పంటలు ఇతర పంటలు సాగు చేసుకునే రైతులకు డ్రిప్ ఇరిగేషన్ పద్ధతి ఎంతో లాభదాయకమని అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లి మండలంలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ముందుగా దిన్నెపాడు పంచాయతీలోని పర్వతరెడ్డిగారి పల్లి లో మామిడి మొక్కల తోటలను వాటర్ షెడ్ చెక్ డ్యాములు గుంతలను ఆయన పరిశీలించారు. అనంతరం గంగనపల్లిలో మంచినీటి పథకం ద్వారా అందించిన త్రాగునీటి సమస్యపై ఆరా తీశారు. అనంతరం అప్పకొండయ్య గారి పల్లెలో రబీలో వ్యవసాయ పద్ధతులు ఉత్పత్తులు యాజమాన్యాలపై రైతులతో మాట్లాడారు. అనంతరం కోణంపేటలోని అంగన్వాడి సెంటర్‌ను పరిశీలించి పిల్లలకు మంచి పౌష్టిక ఆహారాన్ని అందించాలని అంగన్వాడి కేంద్రం వర్కర్‌కు సూచించారు. లక్కిరెడ్డిపల్లిలోని 45 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లు ఆయన పరిశీలించారు. అనంతరం కమ్యూనిటీ ఆసుపత్రికి వెళ్లి రికార్డులు ఎక్రే కాన్పులు ఆపరేషన్ గదులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి సూపరిండెంట్ విష్ణు శివప్రసాద్ తో మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు. 24 గంటలు అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. అలాగే ఇక్కడ ఉన్న రోగులకు మధ్యాహ్నవేళలో భోజనాలు మెనూ ప్రకారం అందించాలని సూపర్డెంట్ కు తెలియజేశారు. పక్కనే ఉన్న సోషల్ హెల్పర్ వసతి గృహాలను పరిశీలించారు. సందర్భంగా ఎస్సీ 1,2, వసతి గ్రహాలు శిథిల వ్యవస్థలో ఉన్నాయని వాటిని మరమ్మతులు చేయించేందుకు ప్రభుత్వం 40 లక్షల రూపాయలు మంజూరు చేసిందని పనులు ఇంతవరకు ప్రారంభించలేదని త్వరలోనే పనులు పూర్తి చేయాలని సోషల్ హెల్పర్ అధికారులకు ఆదేశించారు. వెలుగులు ప్రాజెక్టు నీరు కుడి కాలవ ద్వారా దొరి చెరువు. నీరు వచ్చే విధానాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం గాండ్లపల్లి లో ప్రకృతి వ్యవసాయంతో సాగుచేసిన వరి పంటలను పరిశీలించి డ్రోన్ కెమెరా ద్వారా పంటకు చీడపీడల నివారణకు కషాయాలు స్ప్రే చేసే విధాన్ని ఆయన పరిశీలించారు. వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండి రైతులకు సూచనలు సలహాలు అందించాలన్నారు అలాగే రబీ సీజన్లో సాగు చేసిన పంటలకు క్రాపు బుకింగ్ తప్పనిసరిగా చేయించాలన్నారు. అధికారులు వేసవిలో ఆయా గ్రామాల్లో అందు బాటులో ఉండి ప్రజా సమస్యలపై ఆరా తీయాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి వెంకటరత్నం మండల టిడిపి అధ్యక్షుడు యనమల మదనమోహన్ తాసిల్దార్ క్రాంతికుమార్ ఎంపీడీవో రెడ్డయ్య మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్ఎండి షఫీ నాయక్ ఐసిడిఎస్ పి.డి హైమావతి సిడిపిఓ జహారాభి ఎంఈఓలు చక్రే నాయక్ వెంకటసుబ్బయ్య ఈవోపీఆర్డి ఉషారాణి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ కొండూరు వెంకటరామరాజు ఐసిడిఎస్



**వెలుగులు ప్రాజెక్టు నుంచి అన్ని చెరువులకు నీరు అందిస్తాం**

వెలుగులు ప్రాజెక్టు నుంచి అన్ని సెలవులకు తాగు సాగునీరు అందిస్తామని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు బుధవారం లక్కిరెడ్డిపల్లి లో ఆయన విలేకరులతో మాట్లాడారు ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన పండ్ల తోటలకు డకోట గుంతలు రైతులు ఉపయోగించుకొని పంటలు సాగు చేసుకోవచ్చున్నారు. అంతేకాకుండా ఏయే గ్రామాలలో త్రాగునీటి సమస్య ఉంటే తక్షణమే రెవెన్యూ మండల పరిషత్ అధికారులు గుర్తించి ఆ గ్రామాలకు తాగులేరు తక్షణమే అందించాలన్నారు. మండలంలోని అన్ని చెరువులకు వెలిగల్లు ప్రాజెక్టు నీరు నింపుతామన్నారు. వెలిగల్లు ప్రాజెక్టు కాలువలు కూడా మరమ్మతులకు నివేదికలు పంపించామని తొందరలో కాలువలు పూర్తి చేస్తామన్నారు.


# వృషబాచలేశ్వర స్వామి ఆలయానికి భద్రత కల్పించండి

### - బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్



**వేంపల్లె - సూర్య వాస్తవం:** వేంపల్లి పాపాగ్ని నదీ తీరాన వెలసిన వృషబాచలేశ్వర స్వామి ఆలయానికి భద్రత కల్పించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. ఈ మేరకు బుధవారం నాడు తిరుపతిలో టీ.టీ.డీ పాలక మండలి సభ్యులు భానుప్రకాష్ రెడ్డిని కలసి వినతిపత్రం ఇచ్చారు. భానుప్రకాష్ రెడ్డి తిరుపతిలో ఉన్న రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ అజాద్ తో చరవాణి లో మాట్లాడినట్లు చెప్పారు. త్వరలోనే అక్కడి ఆలయ కమిటీ తీర్మానం తెప్పించుకుని సెక్యూరిటీతో పాటు నాయిబ్రాహ్మణులను నియమించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. అలాగే ఆలయానికి సంబంధించి తూర్పు, పడమర రాజగోపురాలు, ప్రకారం నిర్మానానికి టీ.టీ.డీ నుంచి నిధులు మంజూరు చేయిస్తామని భానుప్రకాష్ రెడ్డి చెప్పినట్టు గాలి హరిప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పులివెందుల బీజేపీ మండల శాఖ అధ్యక్షులు నవీన్, గోవిందు గణేష్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీసీ హాస్టల్‌లో భోజన నాణ్యత పరిశీలన



**శింగనమల - సూర్య వాస్తవం:** శింగనమల మండల కేంద్రంలోని వెనుకబడిన తరగతుల (బీసీ) బాలుర వసతి గృహాన్ని సమాచార హక్కు చైతన్య వేదిక జిల్లా ఉపాధ్యక్షులు పీజీ నల్లప్ప బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా సభ్యులతో కలిసి విద్యార్థులకు వడ్డిస్తున్న భోజన నాణ్యతను స్వయంగా పరిశీలించారు.

**మెనూ అమలు:** హాస్టల్‌లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని రికార్డులను తనిఖీ చేశారు. వంట గదిని పరిశీలించి, వండిన పదార్థాల రుచిని చూశారు. కూరగాయలు, బియ్యం నాణ్యతగా ఉండాలని వార్డెన్‌కు సమాచార చట్టం బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు.

**విద్యార్థులతో ముఖాముఖి:** విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పీజీ నల్లప్ప మాట్లాడుతూ, విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని అధికారులను కోరారు. హాస్టళ్లలో వసతుల కల్పనపై నిరంతరం నిఘా ఉంచుతామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యులు మిట్ట పవన్ కుమార్, కడియాల వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా నిధులు డ్రా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి


**వేంపల్లె - సూర్య వాస్తవం:** ఇడుపులపాయ గ్రామ పంచాయితీలో అక్రమంగా నిధులు డ్రా చేసిన పంచాయతీ సెక్రటరీ, ఆర్ డబ్ల్యు ఎస్ ఏఈలపై విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని ఇడుపులపాయ మాజీ సర్పంచ్, జనసేన నాయకులు పోతిరెడ్డి చలపతి కోరారు. ఈ మేరకు ఆయన కడప కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు పిర్యాదు చేశారు.



ఇడుపులపాయ గ్రామ పంచాయతీలో పంచాయతీ సెక్రటరీ, ఆర్ డబ్ల్యు ఎస్ ఏఈ కలిసి, నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా తప్పుడు బిల్లులు తయారు చేసి పంచాయతీ నిధులను అడ్డగోలుగా డ్రా చేసిన విషయం నా దృష్టికి వచ్చిందని, ఈ అక్రమాలపై నేను ముందుగానే వారికి మీరు తప్పుడు బిల్లులు పెడుతున్నారని స్పష్టంగా హెచ్చరించినప్పటికీ, నా మాటలను లెక్కచేయకుండా అదే విధంగా అక్రమ బిల్లులు పెట్టి నిధులు డ్రా చేయడం జరిగిందని కలెక్టర్ కు విన్నవించారు. ఇది కేవలం ఆర్థిక అక్రమమే కాకుండా ప్రభుత్వ నిధుల దుర్వినియోగం కూడా అని తెలిపారు. కావున ఈ విషయంలో దయచేసి ప్రత్యేక బృందంతో సమగ్ర విచారణ జరిపించి, అక్రమంగా డ్రా చేసిన మొత్తం ఎంతనేది నిర్ధారించి, బాధ్యులైన పంచా యతీ సెక్రటరీ మరియు ఆర్ డబ్ల్యు ఎస్ ఏఈ లపై కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు, అక్రమంగా డ్రా చేసిన నిధులను తిరిగి ప్రభుత్వ ఖజానాకు జమ చేయించవలసిందిగా కలెక్టర్ కు వినతి పత్రం ద్వారా తెలియజేసినట్లు ఇడుపులపాయ మాజీ సర్పంచ్, జనసేన నాయకులు పోతిరెడ్డి చలపతి తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ సంబంధిత అధికారులకు సిఫారసు చేసినట్లు చలపతి తెలిపారు.

# శ్రీశ్రీశ్రీ మల్లూరమ్మ.. నీ జాతరకు నువ్వే దిక్కమ్మ

- శ్రీ మల్లూరమ్మ తల్లి ఆలయం ఈవో కొండారెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు
- ఆలయంలోని హుండీ తాళాలు మాయం, నిధులు దుర్వినియోగం చేశారంటూ ఆరోపణ
- ధ్వజస్తంభం ఏర్పాటు పేరుతో దాతల నుంచి అనాధికారికంగా లక్షలలో చందాలు వసూలు చేసిన వైనం
- ప్రతి ఏటా పౌర్ణమి రోజున జరగనున్న మల్లూరమ్మ జాతర
- జాతర గడువు ముంచుకొస్తున్నా ఇప్పటివరకు జాతర నిర్వహణపై ఎలాంటి స్పష్టత ఇవ్వని ఆలయ అధికారులు, ఆపై అధికారులు
- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు
- జాతర నిర్వహణ తేదీలు ప్రకటించాలంటూ భక్తులు, గ్రామస్తులు డిమాండ్

**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం పరిధిలోని చిన్నమండెం మండలంలో మల్లూరు కొత్తపల్లి గ్రామంలో వెలసిన శ్రీ మల్లూరమ్మ తల్లి ఆలయంలోని హుండీ తాళాలు, ఆలయానికి సంబంధించిన నిధులు దుర్వినియోగం చేశారంటూ ఆలయ ఈవో కొండారెడ్డి, ఆలయ పూజారులు పై గ్రామస్తులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రతి ఏటా ఎంతో వైభవంగా జరిగే ఈ జాతరకు రాయలసీమ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఈ జాతర గంగమ్మ జాతర తరహాలో జరుగుతూ రావడం ఇక్కడ విశేషం. భక్తులు కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న శ్రీ మల్లూరమ్మ తల్లికి మొక్కుబడులు ఉన్న భక్తులు జాతర కు హాజరై నగదు, బంగారు, వెండి వంటి వస్తువులను చెల్లించి తమ మొక్కులు తీర్చుకోవడం జరుగుతుంది. ఈ ఏడాది జాతర గడువు ముంచుకొస్తున్న ఇప్పటివరకు అటు ఆలయ అధికారులు కానీ జాతర నిర్వాహకులు కానీ పట్టించుకున్న పాపాన పోలేదు. జాతర మార్చి 4, 5 తేదీలలో అంటూ కొన్ని సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నా ఇప్పటివరకు జాతర నిర్వహణ పై ఆలయ ఈవో కొండారెడ్డి, సంబంధిత అధికారులు ఎలాంటి అధికారిక ప్రకటన ప్రకటించకపోవడంతో జాతర ఎప్పుడు నిర్వహిస్తారో అన్నది సందిగ్ధంలో నెలకొంది. జాతర నిర్వహించేందుకు గ్రామస్తులు సిద్ధమై ఆలయం వద్ద సమావేశం కాగా ఆలయంలో ఉండే హుండీని లెక్కించాలని ఈవో కొండారెడ్డిని కోరగా అందుకు ఆయన తన వద్ద ఉన్న తాళాలతో హుండీని తెరిచేందుకు ప్రయత్నించారు. కానీ హుండీ కి వేరే తాళాలు మార్చినట్లు గ్రామస్తులు, అక్కడే ఉన్న పోలీసులు సైతం గుర్తించారు. హుండీ తాళాలు మాయం, నిధులు దుర్వినియోగం, ధ్వజస్తంభం ప్రతిష్ట పేరుతో అనధికారికంగా చందాలు వసూలు చేసి స్వాహా చేశారంటూ కొందరు గ్రామస్తులు ఆలయ ఈవో కొండారెడ్డి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కాసేపు అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొంది. బాధ్యతారహితంగా వ్యవహరించిన ఆలయ ఈవో కొండారెడ్డి, పూజారుల పై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

# మైనర్ బాలికతో అసభ్య ప్రవర్తన

### - ఫోక్సో కేసులో నిందితుడికి నాలుగేళ్ల జైలు

**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా శింగనమల మండలం చిన్న మట్లగొంది గ్రామానికి చెందిన ముత్యాల సంపత్ (29) ఓ మైనర్ బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన కేసులో ఫోక్సో ప్రత్యేక న్యాయస్థానం నాలుగేళ్లు జైలుశిక్షతో పాటు రూ.4 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. బాధితురాలికి రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.కేసు పూర్వ పరాలు పరిశీలిస్తే.......2020 జూన్ 1 తేదీ ఉదయం సుమారు 8 గంటల సమయంలోముత్యాల సంపత్ ఓ బాలిక(15) ఇంట్లో ఒంటరిగా ఉండగా... నీళ్లు అడిగేందుకు ఇంట్లోకి ప్రవేశించాడు. బాలిక నీళ్లు తీసుకురావడానికి లోపలికి వెళ్లిన సమయంలో నిందితుడు తలుపులు మూసి, గడియ పెట్టి ఆమెపై అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక అరవడానికి ప్రయత్నించగా, నోరు మూసి చంపుతానని బెదిరించాడు. అనంతరం బాలిక అతని నుండి తప్పించుకుని బయటకు వచ్చి జరిగిన విషయాన్ని తన పిన్నమ్మకు తెలిపింది.వారి తల్లిదండ్రులు కూలి పనుల నుండి ఇంటికి చేరుకున్న తర్వాత అదే రోజు శింగనమల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు అప్పటి సింగనమల ఎస్.ఐ రాంభూపాల్ నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం ఫోక్సో ప్రత్యేక సెషన్స్ న్యాయస్థానం, అనంతపురంలో చార్జ్ షీట్ దాఖలు చేశారు. పోక్సో కోర్టు న్యాయమూర్తి చిన్నబాబు ఈ కేసులో మొత్తం 7 మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి నాలుగు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.4 వేలు జరిమానా విధించారు. అదనంగా బాధితురాలికి రూ.50 వేలు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ కేసును స్పెషల్ పీపీ లక్ష్మీనారాయణ ప్రాసిక్యూషన్ తరఫున వాదించారు.



**పోలీసు అధికారులకు ఎస్పీ జగదీష్ ప్రశంస**

అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు, కోర్టు మానిటరింగ్ సిస్టమ్ సీఐ ఎస్. విజయ భాస్కర్ గౌడ్, శింగనమల ఎస్.ఐ విజయ్ కుమార్ పర్యవేక్షణలో కోర్టు మానిటరింగ్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, కానిస్టేబుల్ రామమోహన్, శింగనమల పీసీ గంగాధర్ సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరు పరచి, నిందితుడికి శిక్ష పడేందుకు కృషి చేశారు. వీరిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# అసెంబ్లీ క్రీడా పోటీల్లో
# క్యారమ్స్ విజేతగా ఎమ్మెల్యే విజయశ్రీ

- ప్రజాప్రతినిధుల మధ్య క్రీడా పోటీలు
- ఉత్సాహభరిత వాతావరణం
- క్రీడా వేదికపై ప్రతిభ చాటిన ప్రజాప్రతినిధులు





**నాయుడుపేట - సూర్య వాస్తవం:** నగరంలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం క్రీడా ఉత్సాహంతో కళకళ లాడింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఏపీ అసెంబ్లీ క్రీడా మహోత్సవం - ఆట విడుపు" కార్యక్రమం ఘనంగా జరిగింది. రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉత్సాహంగా పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటారు. శాసన కార్యక్రమాలతో నిత్యం తీరికలేని ప్రజాప్రతినిధులు క్రీడా వేదికపై ఒకే కుటుంబంలా పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. క్రికెట్, బ్యాడ్మింటన్, క్యారమ్స్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించగా, ప్రతి విభాగంలోనూ ఉత్సాహభరిత వాతా వరణం నెలకొంది. ఈ సందర్భంగా అమరా వతిలోని శాసనసభ ప్రాంగణంలో జరిగిన క్యారమ్స్ సింగిల్స్ పోటీల్లో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచారు. పోటీ మొత్తం ప్రశాంతంగా, ఏకాగ్రతతో ఆడిన ఆమె ఫైనల్ రౌండ్‌లో ఆధిపత్యం ప్రదర్శించి గెలుపొందారు. ఆమె విజయంపై పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అభినందనలు తెలియజేశారు. విజయానంతరం ఎమ్మెల్యే విజయశ్రీ విలేకరులతో మాట్లాడుతూ, "ప్రజాసేవలో నిమగ్నమై ఉండే మేమంతా క్రీడల ద్వారా ఒకరితో ఒకరం మరింత సన్నిహితంగా మారుతున్నాం. ఈ క్రీడా పోటీలు మన మధ్య ఉన్న అనుబంధాన్ని బలపరుస్తున్నాయి" అని తెలిపారు. క్రీడలు శారీరక, మానసిక దృఢత్వానికి తోడ్పడటమే కాకుండా నాయకుల మధ్య స్నేహభావం, సమన్వయం పెంపొందించేందుకు దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. అసెంబ్లీ క్రీడా మహోత్సవం ప్రజాప్రతినిధుల్లో ఆరోగ్యకరమైన పోటీ స్ఫూర్తిని పెంచి, శాసనసభ కార్యకలాపాల్లోనూ సమగ్రతను పెంచుతుందని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మొత్తంగా అసెంబ్లీ క్రీడా పోటీలు ప్రజాప్రతినిధుల మధ్య ఐకమత్యానికి, క్రీడాస్ఫూర్తికి వేదికగా నిలిచాయి.

# స్వావలంబన ఆధారిత ఏజెంటిక్
# మల్టీమోడల్ ప్లాట్‌ఫామ్ ఆవిష్కరణ



**హైదరాబాద్ - సూర్య వాస్తవం :** హైదరాబాద్‌లో నిర్వహించిన గ్రోత్ ఎక్స్ 2026 సదస్సులో అత్యాధునిక కృత్రిమ మేధస్సు ప్లాట్‌ఫామ్ తథ్యను పరిచయం చేశారు. ఈ సదస్సును ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నిర్వహించింది. ఎంటర్‌ప్రైజ్ డేటాను బుద్ధిమంతమైన సమాచారంగా తథ్య ఒక ఏజెంటిక్, మల్టీమోడల్ ఏఐ ప్లాట్‌ఫామ్. విభిన్న రూపాల్లో ఉన్న సంస్థల డేటాను ఖచ్చితమైన, ఆధారాలతో కూడిన సమాచారంగా మార్చి, వెంటనే ఉపయోగించగల డ్రాఫ్ట్‌లను తయారు చేస్తుంది. క్లౌడ్‌పై ఆధారపడని విధంగా రూపొందించబడిన ఈ వ్యవస్థను ఆన్-ప్రెమైస్, ఎయిర్-గ్యాప్ వాతావరణంలో ప్రైవేట్ సాస్ సింగిల్ టెనెంట్ విపీసీ గా వినియోగించవచ్చు లేదా అనుమతించిన పబ్లిక్ క్లౌడ్‌లో అమలు చేయవచ్చు. లక్షల ఫైళ్లను ముందుగా ప్రాసెస్ చేసి, సంస్థ ఉపయోగించే వివిధ భాషల్లో వివరణాత్మక అవగాహనను అందిస్తుంది.ఏజెంటిక్ రాగ్ సంస్థల కోసం కొత్త తరహా విధానంఈ ప్లాట్‌ఫామ్‌లో పనిచేసే ఏజెంట్‌ల సమూహం అర్థంచేసుకో - ప్రణాళిక - కనుగొను - చర్య తీసుకుని - తెలియజేయి. వినియోగ దారుల ఉద్దేశాన్ని అర్థం చేసుకుని, ఆధారాలను సేక రించి, అవసరమైన టూల్స్‌ను ఉపయోగించి, ఫలితాలను స్వయంగా ధృవీకరించి ఆధారాలతో అందిస్తుంది.ఏఐ ఆధారిత సర్వైలెన్స్ వ్యవస్థలుతథ్య ఆధారిత సర్వైలెన్స్ పరిష్కా రాలు పరిసరాలను నేర్చుకుని మార్పులకు అను గుణంగా పనిచేస్తాయి. భారత సైన్యం, పౌర ప్రాం తాలు, కల్లోలిత ప్రాంతాల్లో ఎక్కువగా వినియోగిస్తున్నారు. డ్రోన్లలో ఏఐ శక్తి ఏఐ ఆధారిత డ్రోన్ సాఫ్ట్‌వేర్ అభి వృద్ధిలో ముందంజ లో ఉన్న సంస్థ జెనరేటివ్ మైండ్స్ తమ సాంకేతికతలను ప్రదర్శిం చింది. ముఖ్యంగా ముఖ్య సామర్థ్యాలు స్వయంచాలక నావిగేషన్ ఒ అడ్డంకుల నివారణ, వస్తువుల గుర్తింపు మరియు ట్రాకింగ్, 3డి మ్యాపింగ్ అండ్ ఎరియల్ ఇమేజింగ్, ప్రెసిషన్ అగ్రికల్చర్ విశ్లేషణ, విపత్తు స్పందన సహాయం, ఫ్లైట్ సమయంలో పిక్సెల్ స్థాయి మార్పుల గుర్తింపు వీటి ఉపయోగాలు: వరద నష్టం అంచనా, భూ ఆక్రమణ, గనులు, సరిహద్దు మార్పులు మొదలైనవి. అమలు చేసిన ప్రాజెక్టులు ఆర్మీ సర్వైలెన్స్ డ్రోన్లు అలాగే తెలంగాణ పోలీస్ పరిధి పర్యవేక్షణ, సైనిక శిక్షణ కోసం ఏఐ డ్రోన్ ఫ్లీట్, ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, పోలీస్‌తో పదిహేను పైగా ఐఎస్ఆర్ ప్రాజెక్టులు రూపకల్పన చేసినట్లు సంస్థ సీఈవో కల్నల్ నరేంద్ర త్రిపాఠి తథ్య లో అభివృద్ధి చేసిన ఇంటెలిజెంట్ రేషనల్ ఏజెంట్లు మరియు సర్వైలెన్స్ డ్రోన్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సైన్స్ వేదిక అధ్యక్షుడు డా. ముచ్చుకోట సురేష్ బాబు, యంగ్ మైండ్స్ అధ్యక్షులు డా .నిఖిల్ పలు ఇంజనీరింగ్ కళాశాలల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రామ స్థాయి బలోపేతానికి దిశానిర్దేశం

- రాష్ట్ర నాయకత్వం మార్గదర్శకత్వంలో కమిటీల సమీక్ష
- పునబాకలో విస్తృత స్థాయి సమావేశం
- నేతల సమక్షంలో కార్యాచరణకు రూపురేఖలు



**పెళ్లకూరు - సూర్య వాస్తవం:** రాష్ట్రంలో పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేయాలన్న లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కీలక కార్యక్రమం నిర్వహించబడింది. ఆయన సూచించిన మార్గదర్శకాల ప్రకారం సూళ్లూరుపేట నియోజకవర్గంలో కమిటీల ఏర్పాటు, వాటి పనితీరుపై సమగ్ర సమీక్ష చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే, సూళ్లూరుపేట నియోజకవర్గ ఇంచార్జి కిలివేటి సంజీవయ్య సలహాలు, సూచనలతో ఈ కార్యక్రమానికి స్పష్టమైన దిశానిర్దేశం లభించిందని నాయకులు తెలిపారు. పార్టీ నిర్మాణాన్ని క్రమబద్ధీకరించడంలో ఆయన పాత్ర ప్రశంసనీయమని పేర్కొన్నారు. మాజీ ఎన్‌డీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నలుగురు మండలం లోని పునబాక గ్రామపంచాయతీ కమిటీని పరిశీలించారు. గ్రామ కమిటీతో పాటు బీసీ, మహిళా, ఎస్సీ, రైతు, యూత్, స్టూడెంట్, సోషల్ మీడియా కమిటీల కార్యకలాపాలను సమగ్రంగా సమీక్షించారు. సభ్యుల నియామకం, బాధ్యతల పంపిణీ, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచే ప్రజలకు చేరువై వారి సమస్యలను గుర్తించి పరిష్కార దిశగా కృషి చేయడం ప్రతి కమిటీ బాధ్యత అని స్పష్టం చేశారు. పార్టీ సిద్ధాంతాలను గ్రామాల్లో బలంగా చాటిచెప్పి, సామాజిక సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అట్ల కృష్ణయ్య, గౌడ్ కుమార్ స్వామి, వెంకటరాజు, చలపతి తదితర నాయకులు పాల్గొన్నారు. వారి సమన్వయం, చురుకుదనం కార్యక్రమానికి ప్రత్యేక శోభను చేకూర్చింది. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరై నాయ కత్వానికి సంఘీభావం తెలిపారు. రాష్ట్ర నాయకత్వం మార్గదర్శకత్వంలో గ్రామ స్థాయి నిర్మాణాన్ని బలోపేతం చేస్తూ పార్టీని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నట్లు నేతలు స్పష్టం చేశారు.

# శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు

### - దొరవారిసత్రం ఎస్ఐగా జి.వి. చౌదరి బాధ్యతల స్వీకారం

**దొరవారిసత్రం - సూర్య వాస్తవం :** సాధారణ బదిలీలలో భాగంగా తిరుపతి జిల్లా దొరవారిసత్రం పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్సైగా జి.వి. చౌదరి బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ పట్టణంలో శాంతి భద్రతలను కట్టుదిట్టంగా అమలు చేయడమే తమ ప్రథమ లక్ష్యమని తెలిపారు. ప్రజల సహకారంతో చట్ట పరిపాలనను మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. రోడ్లపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తారని చెప్పారు. ప్రజలు కూడా ట్రాఫిక్ నియమాలను పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. అక్రమ కార్యకలాపాలపై కఠిన వైఖరి అవలంబిస్తామని ఎస్సై జి.వి. చౌదరి హెచ్చరించారు. ముఖ్యంగా గంజాయి వంటి మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని, అవసరమైతే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టణాన్ని వివాద రహితంగా, శాంతియుతంగా ఉంచేందుకు ప్రత్యేక పర్యవేక్షణ బృందాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. సామాజిక సమస్యలు, ప్రజల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని వివరించారు. మహిళల భద్రతకు ప్రభుత్వం రూపొందించిన 'శ్రీ శక్తి' యాప్‌ను విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ఈ యాప్‌ను ఉపయోగించుకోవడం ద్వారా తక్షణ సహాయం పొందవచ్చని తెలిపారు. మహిళలు భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా సమస్యలు ఎదురైన వెంటనే పోలీసులను సంప్రదించాలని కోరారు. ప్రజల సహకారంతో దొరవారిసత్రం పట్టణాన్ని శాంతి, భద్రతల పరంగా ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఎస్సై జి.వి. చౌదరి వెల్లడించారు.

# ఆఖిల భారత రెడ్డి సంఘంలో పలువురు నియామకాలు...



**పెనుగొండ -సూర్య వాస్తవం** అఖిల భారత రెడ్డి సంఘంలో పలువురిని నియమించినట్లు అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి, సత్యసాయి జిల్లా అధ్యక్షులు అంజుగుంటి అశోక్ రెడ్డి లు తెలిపారు.బుధవారం వారు మాట్లాడుతూ

అఖిల భారత రెడ్డి సంఘంలో పలువురిని నియమించి వారికి నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు.అన్నమయ్య జిల్లా మహిళా అధ్యక్షురాలు గా కె. మల్లేశ్వరి రెడ్డి ,పెనుగొండ నియోజకవర్గ అధ్యక్షులు గా నల్లపరెడ్డి సుధాకర్ రెడ్డి,పెనుగొండ నియోజకవర్గం రైతు విభాగం అధ్యక్షులుగా దండు రామచంద్రరెడ్డి , సత్యసాయి జిల్లా కార్యదర్శి గా ఆర్. యన్. నంజీరెడ్డి, సత్యసాయి జిల్లా కార్యవర్గ సభ్యులు గా సి. రంగారెడ్డి,పెనుగొండ మండలం యువజన విభాగం అధ్యక్షులుగా సి. తరుణ్ కుమార్ రెడ్డి లను నియమించినట్లు జగన్మోహన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి లు తెలిపారు.ఈ సందర్భంగా రెడ్డి సంఘం రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ వివిధ పదవులు పొందిన వారికి అఖిల భారత రెడ్డి సంఘం తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తమ నాయకత్వంలోరాష్టంలో రెడ్డి యువత, మహిళాలు ఐక్యంగా ముందుకు సాగి, సమాజాభివృద్ధి దిశగా మరింత కృషి చేస్తారని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నామని తెలిపారు.

**రెడ్డి సమాజం ఐక్యమే మన బలం**

మన సేవా ప్రయాణం విజయవంతం కావాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నానని తెలిపారు.పదవులు పొందిన వారు మాట్లాడుతూ మా మీద నమ్మకంతో పదవులు ఇచ్చినందుకు రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురుకూటి రామభూపాల్ రెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పొన్నపురెడ్డి శకుంతలరెడ్డి, రాష్ట్ర రైతులువిభాగం ఉపాధ్యక్షులు మంచాల సుధాకర్ రెడ్డి,జిల్లా అధ్యక్షులు అశోక్ రెడ్డి,రాష్ట్ర, జిల్లాల, నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# మఠాధిపతి పట్టాభిషేకానికి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలి

### - ఎంపీడీవోకు ఎంపీపీ వీరనారాయణరెడ్డి ఆదేశం



**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం :** నేడు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాములవారి మఠం మఠాధిపతి పట్టాభిషేకం గావిస్తున్న సందర్భంలో నలుమూలల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాటు చేయాలని బి.మఠం ఎంపీడీవో రామచంద్రారెడ్డికి బి.మఠం ఎంపీపీ చిలేఖాంపల్లి వీరనారాయణరెడ్డి ఆదేశించారు. నేడు బ్రహ్మంగారి మఠంలోని అన్ని పురవీధులన్నీ శుభ్రంగా ఉంచాలని,దుమ్ము,ధూళి లేకుండా ట్రాక్టర్లతో నీళ్లు చల్లించాలని ఆయన సూచించారు.స్థానిక పంచాయతీ అధికారులు అప్రమత్తంగా ఉండి పై ఏర్పాట్లన్నీ సవ్యంగా జరిగేటట్లు చూడాలని ఆయన ఎంపీడీవోకు సూచించారు. మన మండలం, మన పంచాయతీ, మన గ్రామంలో జరుగుతున్న మఠాధిపతి పట్టాభిషేకం తిలకించేందుకై మండలంలోని ప్రజలందరూ విచ్చేసి జయప్రదం చేయాలని ఆయన మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )